



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 229 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు శుక్రవారం 24 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥


VOLUME :1 ISSUE :229 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE FRI 24 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


### అక్రమ చొరబాటుదారుల ఆట కట్టిస్తాం..

## బెంగాల్‌ను విముక్తం చేయండి

- హుగ్లీ జిల్లా బాలాగర్ లో అమిత్ షా బహిరంగసభ
- బెంగాల్ లో బీజేపీ ప్రభుత్వం రాగానే అక్రమ చొరబాటుదారుల ఆట కట్టిస్తామన్న అమిత్ షా
- మే 5వ తేదీతో మమతా బెనర్జీ పాలన ముగుస్తుందని ధీమా



పెన్ పవర్ డెస్క్:పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హుగ్లీ జిల్లా బాలాగర్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా భారీ బహిరంగసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర భద్రత, ఆర్థిక వ్యవస్థపై అక్రమ వలసల ప్రభావాన్ని ఎండగట్టారు. బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం రాగానే ఒక్కరిని కూడా

- మిగతా2లో



## టార్గెట్లు కాదు.. భద్రతే ముఖ్యం

### బ్యాంకులకు హైదరాబాద్ సీపీ సజ్జనార్ కీలక ఆదేశాలు

- సైబర్ మోసాల కట్టడిపై బ్యాంకులతో హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఉన్నతస్థాయి సమావేశం
- 'జీరో మూల్ అకౌంట్లు' లక్ష్యంగా పనిచేయాలని బ్యాంకులకు ఆదేశం 2లో
- అకౌంట్ల సంఖ్య కన్నా పౌర భద్రతకే ప్రాధాన్యం ఇవ్వాలని సూచన
- మోసాలకు సహకరించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరిక
- విదేశాల కేంద్రంగా సైబర్ మోసాలు.. బ్యాంకు అధికారుల పాత్రపై సీపీ ఆందోళన

### తమిళనాడు, బెంగాల్ లో ముగిసిన పోలింగ్...

## రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదు



- సాయంత్రం 5 గంటలకే తమిళనాడులో 82.24%, బెంగాల్‌లో 89.93% ఓటింగ్
- కన్యాకుమారిలో పడవల్లో డ్యామ్ దాటి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్న గిరిజనులు
- 2021 ఎన్నికల నాటి పోలింగ్ శాతాన్ని అధిగమించిన రెండు రాష్ట్రాలు
- డీఎంకే కూటమి 200కు పైగా సీట్లు గెలుస్తుందని ఎండీఎంకే నేత వైగో ధీమా

- మిగతా2లో

### జగన్ నివాసానికి వెళ్లి ఆశీస్సులు అందించిన

## ఒంటిమిట్ట అర్చకులు... టీటీడీ ఫైర్

- ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయ అర్చకులకు టీటీడీ షోకాజ్ నోటీసులు
- మాజీ సీఎం జగన్ నివాసానికి వెళ్లి వేదాశీర్వచనం అందించడమే కారణం
- ఆలయ నిబంధనలను ఉల్లంఘించారని అర్చకులపై టీటీడీ ఆగ్రహం
- రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని నోటీసుల్లో స్పష్టం
- సమాధానం సంతృప్తికరంగా లేకపోతే కఠిన చర్యలని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి ఆలయానికి చెందిన ముగ్గురు అర్చకులపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆలయ నిబంధనలకు విరుద్ధంగా, పులివెందులలో మాజీ సీఎం జగన్ నివాసానికి వెళ్లి ఆయనకు వేదాశీర్వచనం అందించినందుకుగాను వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. టీటీడీ పరిధిలో ఉన్న


- మిగతా2లో

### హరిత, నీలి నగరంగా

# అమరావతిని నిర్మిస్తాం

- అమరావతి పనులకు మళ్లీ ఊపు.. కీలక నిర్ణయాలు తీసుకున్న చంద్రబాబు
- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 60వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం
- కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జి నిర్మించాలని అధికారులకు ఆదేశం
- ఏపీలో మళ్లీ పెట్టుబడులపై విశ్వాసం పెరిగిందన్న ముఖ్యమంత్రి
- ప్రతిష్టాత్మక విద్యా సంస్థలతో అమరావతి విద్యా కేంద్రంగా మారుతుందని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన 60వ సీఆర్డీఏ (రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ) అథారిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పురపాలక, సీఆర్డీఏ, ఆర్థిక, అటవీ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాజధాని నిర్మాణానికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలపై ఈ సమావేశంలో చర్చించారు. అమరావతిని ప్రపంచంలోనే ఓ అత్యుత్తమ హరిత, నీలి (గ్రీన్ అండ్ బ్లూ) నగరంగా, నివాసయోగ్యమైన (లివబుల్) నగరంగా నిర్మిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలకు అమరావతి నగరం నిలయంగా మారుతుందని చంద్రబాబు పేర్కొన్నారు. బిట్స్ పిలాని వంటి క్యాంపస్‌ల ఏర్పాటుతో ఇది కీలకమైన విద్యా కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వంపై పెట్టుబడిదారులకు మళ్లీ విశ్వాసం కలిగిందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగానే రెన్యూ ఎనర్జీ వంటి సంస్థలు ఇంగాట్ సోలార్ వేఫర్ ఉత్పత్తి కోసం అనకాపల్లిలో యూనిట్ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాజధాని నగరాన్ని అనుసంధానిస్తూ కృష్ణా నదిపై నిర్మించే వంతెనను అత్యంత ఆకర్షణీయంగా, ఓ ఐకానిక్ నిర్మాణంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. రాజధాని నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.




### పెట్రోల్, డీజిల్ ధరల పెంపు వుండదు..

## కేంద్రం కీలక ప్రకటన

- ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరల పెంపు లేదన్న కేంద్రం
- ధరల పెంపు వార్తలు అవాస్తవం, దురుద్దేశపూర్వకమని వెల్లడి
- గడిచిన నాలుగేళ్లుగా ధరలు పెంచని ఏకైక దేశం భారతేనని స్పష్టీకరణ
- అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతున్నా భారత్‌లో స్థిరంగానే రేట్లు

పెన్ పవర్ డెస్క్:పశ్చిమ బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతాయంటూ వస్తున్న మీడియా కథనాలపై కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పందించింది. ఈ వార్తలను 'దురుద్దేశపూర్వకమైనవి, తప్పుదోవ పట్టించేవి'గా అభివర్ణిస్తూ కొట్టిపారేసింది.

- మిగతా2లో







### అనకాపల్లిని మరో రంగారెడ్డి

## జిల్లాగా తీర్చిదిద్దుతాం

- రాంబిల్లిలో రూ.5,400 కోట్లతో రెన్యూ సోలార్ ప్లాంట్‌కు శంకుస్థాపన
- రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యమని వెల్లడి
- గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ వ్యవస్థ ధ్వంసమైందని విమర్శ
- విద్యుత్ ఛార్జీలు పెంచబోమన్న హామీకి కట్టుబడి ఉన్నామని స్పష్టీకరణ

- మిగతా2లో

### జయమంగళ వెంకటరమణ రాజీనామా తిరస్కరించిన ఏపీ శాసనమండలి చైర్మన్

- ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ రాజీనామా తిరస్కరణ
- నిర్ణయం తీసుకున్న మండలి చైర్మన్ మోషేన్ రాజు
- రాజీనామాపై హైకోర్టు ఆదేశాలతో నిర్ణయం వెల్లడి
- సమాధానం సంతృప్తికరంగా లేదన్న చైర్మన్
- యథాతథంగా కొనసాగనున్న జయమంగళ ఎమ్మెల్సీ పదవి


- మిగతా2లో



### తెలంగాణలో నేటి నుంచే వేసవి సెలవులు

- తెలంగాణలోని అన్ని పాఠశాలలకు నేటి నుంచి 50 రోజుల పాటు వేసవి సెలవులు
- సెలవులు ప్రకటిస్తూ తెలంగాణ విద్యాశాఖ ఉత్తర్వులు
- ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు
- జూన్ 12న తిరిగి ప్రారంభంకానున్న పాఠశాలలు

- మిగతా2లో



### అనంతబాబుకు సమాచారం అందించినట్లు ఆరోపణలు.. సీఐపై వేటు

- డ్రైవర్ హత్య కేసులో ఏ1గా ఉన్న ఎమ్మెల్సీ అనంతబాబు
- కేసు దర్యాప్తు సమాచారాన్ని ఆయనకు అందించినట్లు సీఐ రవికుమార్ పై ఆరోపణలు
- వీఆర్ కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేసిన ఏలూరు రేంజ్ ఐజీ

- మిగతా2లో



## ఎడిటర్ వ్యూ

### హర్మూజ్ జలసంధిలో 'డిజిటల్' బాంబు.. ఇరాన్ తదుపరి టార్గెట్ డేటా కేబుల్స్..?

ఒకప్పుడు యుద్ధాలు కేవలం సరిహద్దుల్లో ఆయుధాలతో జరిగేవి.. కానీ ఇప్పుడు 'డిజిటల్' రూపం సంతరించుకున్నాయి. చమురు సరఫరా అడ్డుకోవడం ద్వారా ప్రపంచాన్ని వణికించిన ఇరాన్, ఇప్పుడు 'సముద్రగర్భ డేటా కేబుల్స్'పై దృష్టి సారించిందన్న వార్త ఆధునిక ప్రపంచానికి వెన్నులో వణుకు పుట్టిస్తోంది. చమురు లేకపోతే బండ్లు ఆగుతాయి, కానీ డేటా లేకపోతే దేశాలే ఆగిపోతాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఫిజికల్ వార్ నుంచి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వార్‌గా మారుతుంది. హర్మూజ్ జలసంధి కేవలం నౌకలు వెళ్లే దారి మాత్రమే కాదు, అది ప్రపంచాన్ని కలిపే డిజిటల్ హైవే కూడా. ఇరాన్ మీడియా నుంచి అందుతున్న సంకేతాల ప్రకారం.., అమెరికా, ఇజ్రాయెల్ దేశాలను దెబ్బతీయడానికి ఇరాన్ ఇప్పుడు 'సముద్రగర్భ కేబుల్స్'ను ఆయుధంగా వాడుకోవాలని చూస్తోంది. ఇది జరిగితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఊహించని విపత్తును ఎదుర్కోవాల్సి ఉంటుంది.
మనకు ఇంటర్నెట్ శాటిలైట్ల ద్వారా వస్తుందని చాలా మంది అనుకుంటారు. కానీ వాస్తవానికి 95 శాతానికి పైగా అంతర్జాతీయ డేటా ట్రాఫిక్ సముద్రం అడుగున ఉండే కేబుల్స్ ద్వారానే సాగుతుంది. గల్ఫ్ దేశాలను యూరప్, ఆసియాతో కలిపే అనేక ప్రధాన కేబుల్ వ్యవస్థలు హర్మూజ్ జలసంధి గుండా వెళ్తాయి. అంతర్జాతీయ బ్యాంకింగ్ లావాదేవీలు, క్లౌడ్ డేటా స్టోరేజ్, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, ప్రభుత్వాల మధ్య కమ్యూనికేషన్ అంతా ఈ కేబుల్స్ పైనే ఆధారపడి ఉంటుంది.

**అసలు వ్యూహం ఇదేనా?**

చమురు ట్యాంకర్లను అడ్డుకోవడం వల్ల ఇరాన్ ఇప్పటికే ప్రపంచ దేశాల ఆగ్రహానికి గురైంది. ఇప్పుడు డేటా కేబుల్స్ ను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా మరింత ఒత్తిడి తీసుకురావాలని చూస్తోంది. ఈ కేబుల్స్ సముద్రం అడుగున కొన్ని అడుగుల లోతులో ఉంటాయి. ఒక చిన్న లంగరు ద్వారా లేదా ఉద్దేశపూర్వకంగా సబ్‌మెరైన్లతో వీటిని కట్ చేయడం చాలా సులభం. ప్రధాన కేబుల్స్ దెబ్బతింటే, పెర్షియన్ గల్ఫ్ దేశాల్లో ఇంటర్నెట్ పూర్తిగా స్తంభించిపోతుంది. బ్యాంకింగ్ సర్వీసులు ఆగిపోయి, ప్రజలు నగదు విత్‌డ్రా చేసుకోలేక, ఆన్‌లైన్ పేమెంట్స్ చేయలేక గందరగోళం నెలకొంటుంది.
ఇరాన్ గనుక ఈ డేటా యుద్ధానికి దిగితే, అది కేవలం అమెరికా-ఇజ్రాయెల్ దేశాలనే కాదు, మొత్తం ప్రపంచాన్ని ప్రభావితం చేస్తుంది. ఆధునిక ప్రపంచం ఎంతగా టెక్నాలజీపై ఆధారపడి ఉందో, ఆ టెక్నాలజీ ఎంత సులభంగా దెబ్బతినవచ్చో ఈ పరిణామం హెచ్చరిస్తోంది. చమురు సరఫరాను పునరుద్ధరించడానికి ఆరు నెలలు పడుతుందని పెంటగాన్ చెబుతున్న తరుణంలో.. డేటా కేబుల్స్ కు నష్టం జరిగితే పరిస్థితి ఎంత భయంకరంగా ఉంటుందో ఊహించుకోవడమే కష్టం.

# అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లాగా తీర్చిదిద్దుతాం

భారీ పెట్టుబడులతో అనకాపల్లి జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, భవిష్యత్తులో ఈ జిల్లా పెట్టుబడులను ఆకర్షించడంలో దేశంలోనే అగ్రస్థానానికి చేరుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. గతంలో వెనుకబడిన రంగారెడ్డి జిల్లా ఎలాగైతే సంపన్న ప్రాంతంగా మారిందో, విశాఖకు సమీపంలో ఉన్న అనకాపల్లిని కూడా మరో రంగారెడ్డి జిల్లాగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. గురువారం అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.5,400 కోట్ల పెట్టుబడితో రెన్యూ సోలార్ సంస్థ ఏర్పాటు చేస్తున్న 6.5 గిగావాట్ల ఇన్‌గాట్-వేఫర్ తయారీ ప్లాంట్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తూ రాష్ట్ర అభివృద్ధిపై తన ప్రభుత్వ దార్శనికతను ఆవిష్కరించారు.

**పెట్టుబడులతో పునర్నిర్మాణం**

గత ఐదేళ్ల పాలనలో విధ్వంసానికి గురైన ఆంధ్రప్రదేశ్‌ను పునర్నిర్మించాలన్న ఏకైక లక్ష్యంతోనే కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఇటీవలే ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన జరిగిందని గుర్తుచేస్తూ, ఇప్పుడు రెన్యూ ఎనర్జీ సంస్థ భారీ పెట్టుబడితో ముందుకు రావడం శుభపరిణామమన్నారు. కేంద్ర మాజీ మంత్రి యశ్వంత్ సిన్హా కుమారుడు
జయంత్ సిన్హా వేగంగా అభివృద్ధి చెందుతున్న సోలార్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకోవడం రాష్ట్రంపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని కొనియాడారు. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఇప్పటికే సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి జరుగుతుండగా, రాంబిల్లిలో సోలార్ ఫలకాల తయారీ పరిశ్రమ రావడం ద్వారా రాష్ట్రం విద్యుత్ రంగంలో స్వయం సమృద్ధ దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు.

**గ్రీన్ ఎనర్జీయే లక్ష్యం**

రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటికే ఈ రంగంలో రూ.5.95 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. 90 గిగావాట్ల మేర ప్రతిపాదనలు, ఒప్పందాలు (ఎంఓయూలు) సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఒక్క ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ సంస్థే రూ.1.85 లక్షల కోట్ల పెట్టుబడులతో ముందుకు వస్తోందన్నారు. అభివృద్ధికి విద్యుత్ వినియోగం ఒక సూచిక అని, అందుకే విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నామని వివరించారు. దీనిలో భాగంగా పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నామని, ఆర్టీసీ కూడా 1,050 గ్రీన్ బస్సులను ప్రవేశపెడుతోందని, రాష్ట్రవ్యాప్తంగా 5,000 ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయబోతున్నామని ప్రకటించారు.

**గత ప్రభుత్వంపై విమర్శలు**

గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైందని చంద్రబాబు ఆరోపించారు. 2019-24 మధ్య కాలంలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను (పీపీఏలు) రద్దు చేయడం, నిర్వహణా లోపంతో అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేయడం వంటి చర్యలతో రాష్ట్రం తీవ్రంగా
నష్టపోయిందన్నారు. పీపీఏల రద్దు కారణంగా విద్యుత్ వాడుకోకుండానే రూ.9 వేల కోట్ల ప్రజాధనాన్ని చెల్లించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలపై వేల కోట్ల రూపాయల భారాన్ని మోపి 'ట్రూ అప్' ఛార్జీల రూపంలో వసూలు చేశారని విమర్శించారు. తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, తమ ప్రభుత్వం ప్రారంభించిన విద్యుత్ సంస్కరణల ఫలాలను ప్రజలకు అందిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

# తెలంగాణలో నేటి నుంచే వేసవి సెలవులు

విద్యార్థులందరూ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే వేసవి సెలవుల సందడి తెలంగాణలో మొదలైంది. నేటి నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశా లలకు వేసవి సెలవులు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ విద్యాశాఖ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, నేడు (ఏప్రిల్ 23) విద్యా సంవత్సరం అధికారికంగా ముగిసింది. రేపటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలన్నీ వేసవి సెలవుల కారణంగా మూతపడనున్నాయి.

**సమ్మర్ హాలిడేస్ షెడ్యూల్:**

ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు మొత్తం 50 రోజుల పాటు విద్యార్థులకు సెలవులు ఉండనున్నాయి.
జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి.
సాధారణంగా ఏప్రిల్ నెలాఖరు వరకు తరగతులు జరిగేవి, కానీ ఈ ఏడాది ఎండలు ఇప్పటికే 40 డిగ్రీలు దాటుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం ముందస్తుగానే సెలవులు ప్రకటించింది.

# జయమంగళ వెంకటరమణ రాజీనామా తిరస్కరించిన ఏపీ శాసనమండలి ఛైర్మన్

ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సమర్పించిన రాజీనామాను శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజు తిరస్కరించారు. దీంతో ఆయన ఎమ్మెల్సీ పదవి యథాతథంగా కొనసాగనుంది. వివరాల్లోకి వెళితే, 2024 నవంబరులో జయమంగళ వెంకటరమణ వైసీపీకి, తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే, తన రాజీనామాను ఛైర్మన్ ఉద్దేశపూర్వకంగా ఆమోదించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తూ ఆయన గత ఏడాది హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ఇటీవల విచారణ జరిపిన ఉన్నత న్యాయస్థానం, జయమంగళ రాజీనామాపై మూడు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని మండలి ఛైర్మన్‌ను ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వ న్యాయవాది సైతం హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఛైర్మన్ మోషేన్ రాజు, జయమంగళ రాజీనామాను తిరస్కరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రాజీనామాకు జయమంగళ సమర్పించిన సమాధానం సంతృప్తికరంగా లేదనే కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. హైకోర్టు ఆదేశాల తర్వాత చోటుచేసుకున్న ఈ పరిణామం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాజీనామా తిరస్కరణకు గురవడంతో చట్టప్రకారం జయమంగళ ఎమ్మెల్సీగా కొనసాగనున్నారు.కాగా, అప్పట్లో వైసీపీకి రాజీనామా చేసిన జయమంగళ వెంకటరమణ... పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు.

# తమిళనాడు, బెంగాల్ లో ముగిసిన పోలింగ్... రికార్డు స్థాయిలో ఓటింగ్ నమోదు

తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. సాయంత్రం 6 గంటల సమయానికి క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. ఇవాళ తమిళనాడులో మొత్తం 234 స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ జరగ్గా, పశ్చిమ బెంగాల్ లో 152 స్థానాల్లో తొలి విడత పోలింగ్ నిర్వహించారు. రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ప్రజలు, తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు భారీ ఉత్సాహం ప్రదర్శించారు.
ఎన్నికల సంఘం అంచనాల ప్రకారం, సాయంత్రం 5 గంటలకే పశ్చిమ బెంగాల్‌లో 89.93 శాతం, తమిళనాడులో 82.24 శాతం పోలింగ్ నమోదైంది. ఇది 2021 అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన 82 శాతం, 74 శాతం కంటే గణనీయంగా అధికం కావడం గమనార్హం. ఎన్నికలకు ముందు తీవ్ర వివాదానికి దారితీసిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) డ్రైవ్ ప్రభావం ఏమాత్రం కనిపించకపోగా, పోలింగ్ శాతం ఊహించని స్థాయికి చేరడం విశేషం.తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్, ఏఐఏడీఎంకే నేతృత్వంలోని ఎన్డీఏ, నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే), తమిళగ వెట్రి కళగం (టీవీకే) మధ్య చతుర్ముఖ పోటీ నెలకొంది. చెన్నైలో పోలింగ్ చివరి గంటలో, ఓటర్లు తమ హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని ఎన్నికల సంఘం ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసింది. ఏఐఏడీఎంకే అభ్యర్థి డి. జయకుమార్, బీజేపీ నేత ఖుష్బూ సుందర్ వంటి ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకుని, ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు.ఈ ఎన్నికల్లో కన్యాకుమారి జిల్లాలో ప్రజాస్వామ్య స్ఫూర్తి వెల్లివిరిసింది. రోడ్డు సౌకర్యం లేని మారుమూల కొండ ప్రాంతాలకు చెందిన 'కని' గిరిజన తెగ ప్రజలు, పెచిపారై డ్యామ్‌లో పడవలపై ప్రయాణించి వచ్చి మరీ ఓటు వేశారు. డ్యామ్‌లో నీటిమట్టం ఎక్కువగా ఉండటంతో, జిల్లా యంత్రాంగం లైఫ్ జాకెట్లతో కూడిన మూడు ప్రత్యేక పడవలను ఏర్పాటు చేసి వారిని సురక్షితంగా పోలింగ్ కేంద్రాలకు తరలించింది. మరోవైపు, డీఎంకే కూటమి 200కు పైగా స్థానాల్లో గెలిచి అధికారంలోకి రావడం ఖాయమని ఎండీఎంకే నేత వైగో ధీమా వ్యక్తం చేశారు. అదేవిధంగా, పశ్చిమ బెంగాల్‌లో తొలి విడతలో భాగంగా 16 జిల్లాల పరిధిలోని
152 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉత్తర బెంగాల్‌లోని కూచ్ బెహార్, డార్జిలింగ్, జల్‌పాయ్‌గురి, దక్షిణ బెంగాల్‌లోని ముర్షిదాబాద్, పురులియా, బంకురా వంటి జిల్లాల్లో ఓటర్లు భారీగా తరలివచ్చారు. మిగిలిన 142 నియోజకవర్గాలకు రెండో విడత పోలింగ్ ఏప్రిల్ 29న జరగనుంది. రెండు రాష్ట్రాల ఎన్నికల ఓట్ల లెక్కింపు మే 4న చేపట్టి, ఫలితాలను వెల్లడిస్తారు. ఈ ఫలితాలు రెండు రాష్ట్రాల భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

# టార్గెట్లు కాదు.. భద్రతే ముఖ్యం

సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేయడంలో బ్యాంకులు కీలకపాత్ర పోషించాలని, 'జీరో మ్యూల్ అకౌంట్లు' లక్ష్యంగా పనిచేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. గురువారం నగరంలోని 45 ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులకు చెందిన 75 మంది సీనియర్ అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల నుంచి దోచుకున్న డబ్బును మళ్లించేందుకు వాడే 'మ్యూల్ అకౌంట్ల'ను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది.
ఇటీవల హైదరాబాద్ పోలీసులు నిర్వహించిన 'ఆపరేషన్ ఆక్టోపస్'లో భాగంగా మ్యూల్ అకౌంట్లు తెరిచేందుకు కొందరు బ్యాంకు అధికారులు సైబర్ నేరగాళ్లకు సహకరించినట్లు తేలింది. ఈ నేపథ్యంలో సజ్జనార్ బ్యాంకు అధికారులతో నేరుగా మాట్లాడారు. అదనపు పోలీస్ కమిషనర్ (క్రైమ్స్ ఓ సిట్) ఎం. శ్రీనివాసులు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ డైరెక్టర్ చిన్మయ్ కుమార్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ... "బ్యాంకు బ్రాంచ్‌లు కొత్త ఖాతాలు తెరిచే టార్గెట్లపై కాకుండా, పౌరుల భద్రత, సంస్థాగత సమగ్రతపై దృష్టి పెట్టాలి. దీనికోసం 'ట్విన్-ఛాలెంజ్' విధానాన్ని ప్రవేశపెట్టాలి. 'జీరో సైబర్ క్రైమ్ బాధితులు', 'జీరో మ్యూల్ అకౌంట్లు' అనే అంశాలను బ్రాంచ్‌ల పనితీరుకు కొలమానంగా తీసుకోవాలి. ఖాతాల సంఖ్యను పనితీరుకు ప్రామాణికంగా చూడొద్దు" అని సూచించారు. సైబర్ మోసాలకు సంబంధించి తమ సంస్థలో 'జీరో టాలరెన్స్' విధానాన్ని పాటించాలని, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించి, వారికి జాతీయ హెల్ప్‌లైన్ (1930), సైబర్‌క్రైమ్ పోర్టల్ గురించి తెలియజేయాలని ఆదేశించారు. మోసపూరిత ఖాతాలు తెరవడంలో పాలుపంచుకున్న కేవైసీ వెరిఫైయర్లపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని, అలాంటి ఉద్యోగులను బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగం నుంచే బ్లాక్‌లిస్ట్ చేయాలని అన్నారు. 'మ్యూల్ హంటర్' వంటి అధునాతన టెక్నాలజీని ఉపయోగించి మోసాలను గుర్తించాలని సూచించారు.కంబోడియా, వియత్నాం, యూఏఈ వంటి దేశాల నుంచి సైబర్ ముఠాలు పనిచేస్తున్నాయని, అవి భారతీయ మధ్యవర్తుల ద్వారా బ్యాంకు అధికారులతో కుమ్మక్కై మ్యూల్ అకౌంట్లను తెరిచి, నిధులను తరలిస్తున్నాయని సజ్జనార్ వివరించారు. ఈ నెట్‌వర్క్‌లను ఛేదించడంలో బ్యాంకుల సహకారం అత్యంత కీలకమని ఆయన తెలిపారు.

## అనంతబాబుకు సమాచారం అందించినట్టు ఆరోపణలు.. సీఐపై వేటు

డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ప్రధాన నిందితుడు, వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు పోలీసుల అంతర్గత సమాచారాన్ని చేరవేస్తున్నారన్న ఆరోపణలతో సర్పవరం సీఐ రవికుమార్‌పై వేటు పడింది. కేసు దర్యాప్తుకు సంబంధించిన అత్యంత కీలకమైన రహస్య సమాచారాన్ని, పోలీసుల కదలికలను సీఐ రవికుమార్ ఎప్పటికప్పుడు అనంతబాబుకు చేరవేస్తున్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. దర్యాప్తు పారదర్శకతను దెబ్బతీస్తూ నిందితుడికి సహకరించినందుకు గాను, ఏలూరు రేంజ్ ఐజీ ఆయనను తక్షణమే విధుల్లో నుంచి తప్పించి, వీఆర్ కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనపై శాఖాపరమైన విచారణకు కూడా ఆదేశాలు జారీ చేశారు.

## అక్రమ చొరబాటుదారుల ఆట కట్టిస్తాం.. బెంగాల్‌ను విముక్తం చేయండి

- మొదటి పేజి తరువాయి

అక్రమంగా సరిహద్దు దాటి రానివ్వబోమని, ఇప్పటికే ఉన్న వారిని గుర్తించి పంపించివేస్తామని స్పష్టం చేశారు. స్థానిక యువతకు దక్కాల్సిన రేషన్, ఉద్యోగాలను ఈ అక్రమ వలసదారులు లాగేసుకుంటున్నారని, ఇది రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఆటంకమని ఆరోపించారు.మీరు వేసే ఓటు కేవలం ఒక ఎమ్మెల్యే కోసమే కాదని, అక్రమ చొరబాటుదారుల నుంచి బెంగాల్ విముక్తి కోసం కూడా అని పేర్కొన్నారు. మే 5వ తేదీతో 'దీదీ' పాలన ముగుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.నేడు పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి తొలి దశ (152 స్థానాలు) పోలింగ్ జరుగుతోంది. సాయంత్రం 5 గంటల సమయానికే దాదాపు 89 శాతానికి పైగా భారీ ఓటింగ్ నమోదైంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది.

## జగన్ నివాసానికి వెళ్లి ఆశీస్సులు అందించిన ఒంటిమిట్ట అర్చకులు... టీటీడీ ఫైర్

- మొదటి పేజి తరువాయి

ఈ ఆలయంలో పనిచేసే అర్చకులు ప్రొటోకాల్‌ను అతిక్రమించడంపై యాజమాన్యం తీవ్రంగా స్పందించింది. వ్యక్తిగత హోదాలో రాజకీయ నాయకుల ఇళ్లకు వెళ్లి ఆలయ మర్యాదలను పాటించకపోవడం సరికాదని భావించింది. ఈ నేపథ్యంలోనే సదరు అర్చకులపై చర్యలకు ఉపక్రమించింది. అర్చకులకు జారీ చేసిన షోకాజ్ నోటీసుల్లో రెండు రోజుల్లోగా తమ వివరణ సమర్పించాలని టీటీడీ స్పష్టం చేసింది. వారు ఇచ్చే సమాధానం సంతృప్తికరంగా లేకపోతే కఠినమైన క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఆలయ పవిత్రత, నియమ నిబంధనల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని టీటీడీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ నోటీసులపై అర్చకుల నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు. వారి వివరణ అందిన తర్వాత టీటీడీ తదుపరి చర్యలు తీసుకోనుంది.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపు వుండదు.. కేంద్రం కీలక ప్రకటన

- మొదటి పేజి తరువాయి

ధరల పెంపునకు సంబంధించి ప్రభుత్వ పరిశీలనలో ఎలాంటి ప్రతిపాదన లేదని 'ఎక్స్' వేదికగా స్పష్టం చేసింది.ప్రజలలో అనవసర భయాందోళనలు సృష్టించేందుకే ఇలాంటి వార్తలను ప్రచారం చేస్తున్నారని మంత్రిత్వ శాఖ పేర్కొంది. "గత నాలుగేళ్లుగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరగని ఏకైక దేశం భారత్. అంతర్జాతీయంగా ధరలు భారీగా పెరిగినప్పటికీ, ఆ ప్రభావం ప్రజలపై పడకుండా ప్రభుత్వం, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు నిరంతరం చర్యలు తీసుకున్నాయి" అని వివరించింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగి, అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగినప్పటికీ భారత్‌లో ధరలు స్థిరంగానే ఉన్నాయని గుర్తుచేసింది.

**దేశంలో సాధారణంగానే ఎల్పీజీ సిలిండర్ల సరఫరా**

ఇదే సమయంలో దేశంలో వంటగ్యాస్ (ఎల్పీజీ) సరఫరా సాధారణంగా ఉందని, ఎక్కడా కొరత లేదని పెట్రోలియం శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ తెలిపారు. మరోవైపు అమెరికా-ఇరాన్ శాంతి చర్చలు నిలిచిపోవడంతో హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 103 డాలర్లు దాటగా, డబ్ల్యూటీఐ క్రూడ్ ఆయిల్ ధర 94 డాలర్లకు పైగా ట్రేడ్ అవుతోంది.

# స్వచ్ఛ సర్వేక్షన్ లో 'అద్దంకి'కి ఉత్తమ ర్యాంకే లక్ష్యం

## 'విజువల్ క్లీన్ అద్దంకి' సాధనలో అందరూ భాగస్వాములు కావాలి

**అద్దంకి ఆర్.సి(పెన్ పవర్) ఏప్రిల్ 23**

స్వచ్ఛ సర్వేక్షన్ 2025-26లో అద్దంకి పురపాలక సంఘానికి జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంక్ సాధించడమే లక్ష్యంగా అధికారులు అడుగులు వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా.. రాష్ట్ర విద్యుత్ శాఖామాత్యులు గొట్టిపాటి. రవికుమార్ ఆదేశాల మేరకు, ప్రకాశం జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, అద్దంకి ఆర్డీఓ (పురపాలక సంఘ స్పెషల్ ఆఫీసర్) జాన్సన్ ల సూచనలతో మున్సిపల్ కమిషనర్ ఆర్. రవీంద్ర ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని మెప్మా కార్యాలయంలో ఎస్‌హెచ్‌జీ గ్రూపు మహిళలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ?ఈ సదస్సులో పాల్గొన్న మెప్మా సీఎంఎం సత్యవతి, ఏపీ స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ బోర్డు డైరెక్టర్ చిన్ని. లక్ష్మీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఉన్న పట్టణాలు, నగరాల్లో స్వచ్ఛత ప్రమాణాలు పెంచాలన్న మహాత్మా గాంధీ ఆశయాలకు అనుగుణంగా 2016లో కేంద్ర ప్రభుత్వం ఈ స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమాన్ని ప్రారంభించిందని గుర్తు చేశారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో ప్రధాన అంశాలైన తడి చెత్త, పొడి చెత్త, హానికర వ్యర్థాలను ఎప్పటికప్పుడు వేరు చేయాలని, వాటి సరైన నిర్వహణ వల్ల పర్యావరణానికి కలిగే



ప్రయోజనాలను వారు వివరించారు. తడి చెత్తతో ఇళ్ల వద్దనే 'హోం కంపోస్ట్' తయారు చేసుకునే విధానాన్ని, అలాగే వినుకొండ పురపాలక సంఘం పరిధిలో వానపాముల సహాయంతో వర్మీ కంపోస్ట్ తయారు చేస్తున్న విధానాన్ని ఉదాహరణగా చెబుతూ అవగాహన కల్పించారు.

**క్యాన్సర్‌కు కారకమవుతున్న ప్లాస్టిక్..**

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా హోటళ్ల నుంచి వేడివేడి ఆహార పదార్థాలను ప్లాస్టిక్ కవర్లలో తెచ్చుకుని తినడం వల్ల పలు రకాల క్యాన్సర్ల



బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు (క్లాత్ బ్యాగ్స్), జ్యూట్ బ్యాగ్స్, స్టీల్ బాక్సులను మాత్రమే వినియోగించాలని సూచించారు. రోడ్లపై, మురుగు కాల్వల్లో, ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయకుండా బాధ్యతగా వ్యవహరించి 'విజువల్ క్లీన్ అద్దంకి' సాధనకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని కోరారు. ?ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ బాజీ, డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ శివ పార్వతి, సానిటరీ సెక్రటరీలు, మెప్మా ఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రవీంద్రనాధ రెడ్డికి సన్మానం



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 23**

ఇటీవల మార్కాపురం జిల్లా విశ్రాంత ఉద్యోగ సంఘం ఎన్నికలలో గిద్దలూరు సంఘ అధ్యక్షులు జిల్లా శాఖకు అధ్యక్షులుగాఏకగ్రీవంగా ఎన్నికైన గోటిక రవీంద్రనాథ్ రెడ్డి,ని గిద్దలూరు యూనిట్ గురువారం ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. ఉపాధ్యక్షులుగా బి .పాండు, కో ఆప్షన్ కార్యదర్శిగా ఎం. భాస్కర్ రెడ్డి ఎన్నికైన్నారు .ఈ అభినందన సందర్భంగా రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ నిబద్ధతతో సంఘం కోసం , సమాజం కోసం పనిచేసే వారిని పదవులు వరించి వస్తాయని ఆపదవికి వన్నె తెస్తానని గిద్దలూరు కు జిల్లాలో మంచి పేరు ప్రతిష్టలు తెస్తామన్నారు జిల్లా లో అన్ని యూనిట్ల సభ్యుల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీఇచ్చారు . గతం లో యూటీఎఫ్ లో పనిచేసిన అనుభవాన్ని మేళవించి జిల్లా సంఘ అభివృద్ధి కి శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. అభివృద్ధికి నిధులు సమకూర్చుకొనుటకు అందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు .ఈ సందర్భంగా విశ్రాంత ఉపాధ్యాయుడుఆర్. రామాంజనేయరెడ్డి నూతన జిల్లా కమిటీకి ఒక లక్షా పదవేలు విరాళము ప్రకటించారు. వారికి జిల్లా శాఖ పక్షాన ధన్యవాదములు తెలియజేసి రామాంజనేయ రెడ్డిని సత్కరించారు. గిద్దలూరు నుండి మరోయిరువురు ఎన్నిక కాగా వారిని కూడా సభ్యులు సత్కరించి వారి సేవలను కొనియాడారు.

# కోవిలంపాడు స్పెషల్ ఆఫీసర్ కె వి ప్రసాద్‌ను సన్మానించిన టిడిపి నాయకులు



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 23**

మండల తహసిల్దార్ కె.వి. ప్రసాద్ ను కోవిలంపాడు పంచాయితీ స్పెషల్ ఆఫీసర్ గా నియమించిన సందర్భంగా కనిగిరి శాసనసభ్యులు ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ సూచనలతో కోవిలంపాడు పంచాయితీ టిడిపి అధ్యక్షులు అమడసాని బాలకేశవరెడ్డి ఆధ్వర్యంలో గురువారం టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా తో సత్కరించి అభినందనలు తెలిపారు ఈ సందర్భంగా టిడిపి నాయకులు పంచాయతీలోని పలు సమస్యలను తహసిల్దార్ కె వి ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా పలు వీధులలో తాగునీటి కొరత ఏర్పడి పలు చోట్ల మోటార్లు పనిచేయక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అలాగే పంచాయతీ పరిధిలోని పలు స్తంభాలకు వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు రెవెన్యూ పరిధిలో రైతులు భూమి సంబంధిత సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ కె వి ప్రసాద్ రావు స్పందించి పంచాయతీ కార్యదర్శి మనోజ్ కుమార్ కు పంచాయితీలో ఉన్న సమస్యలను పరిశీలించి పరిష్కరించుటకు చర్యలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి అధ్యక్షులు అమడసాని బాలకేశవరెడ్డి, మండల క్లస్టర్ ఇంచార్జి షేక్ రజ్జబ్ భాష, నీటి సంఘం అధ్యక్షులు డి మోహన్ రెడ్డి, నారాయణస్వామి దేవస్థాన మాజీ కమిటీ సభ్యులు పాలపర్తి నారాయణరావు, మండల టిడిపి ఉపాధ్యక్షులు చందలూరి బాల కాశయ్య,చావా వెంకటసుబ్బయ్య, స్వర్ణ గ్రామ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి వర్కర్లకు మే నెల వేసవి సెలవులు ఇవ్వాలి

## కనీస వేతనాలు పెంచాలి, అంగన్వాడి సమస్యలు పరిష్కారం చేయాలి



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 23**

గిద్దలూరు ఎమ్మార్వో కార్యాలయం వద్ద అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేసి అనంతరం ఎమ్మార్వో కు సమస్యలతో కూడుకున్న వినతి పత్రం సమర్పించారు ఈ ధర్నాలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి రుతమ్మ పాల్గొని మాట్లాడుతూ అంగన్వాడి వర్కర్ల న్యాయమైన కోరికలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడంలో మీనమేషాలు లెక్కిస్తుందని అంగన్వాడి కోరికలు గొంతెమ్మ కోరికలు కాదని అన్నారు. తీవ్రమైన ఎండలు పెరుగుతున్న చిన్నపిల్లలు అంగన్వాడి కేంద్రాలకు రావాలంటే ఇబ్బందులు పడుతున్నారని పిల్లలు లేకుండా అంగన్వాడి సెంటర్లు ఎలా నిర్వహించాలని అన్నారు. మే నెల మొత్తం అంగన్వాడి వర్కర్లకు పూర్తిస్థాయిలో సెలవులు ఇవ్వాలని కనీస వేతనం 26 వేల రూపాయలకు పెంచాలని ఆయాల ప్రమోషన్ జీవోలో మార్పులు చేయాలని గత సమ్మె కాలపు ఒప్పందం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు డి స్వర్ణ, ఏ మునెమ్మ, , అంగన్వాడి వర్కర్లు ఆయాలు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ వెబినార్ పుస్తక ఆవిష్కరణ



**కందుకూరు పెన్ పవర్, ఏప్రిల్ 23**

టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గురువారం అంతర్జాతీయ పుస్తక దినోత్సవం ప్రఖ్యాత ఆంగ్ల నాటక రచయిత విలియం షేక్స్పియర్ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ప్రఖ్యాచ రచయిత జన్మదినోత్సవాన్ని ప్రపంచ పుస్తక దినోత్సవం గా ఆంగ్ల భాషా దినోత్సవం గా జరుపుకుంటారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవికుమార్ తెలియజేశారు. పుస్తకాల్ని అధ్యయనం చేయడం అందులోని విషయాన్ని ఆకలింపు చేసుకోవడం ద్వారా ఎంతో జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని, ప్రపంచాన్ని శోధించవచ్చని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండల నరేంద్ర మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు అందరూ కూడా పుస్తక పఠనాన్ని తమ జీవనశైలిగా మార్చుకోవాలని ఉద్బోధించారు. తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ కే. సుజాత మాట్లాడుతూ పుస్తక పఠనం మనల్ని నూతన ప్రపంచంలోకి తీసుకువెళుతుందని, పుస్తక పఠనం ద్వారా సమాజాన్ని అర్థం చేసుకొని, జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలియజేశారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కళాశాల ఆంగ్లశాఖ తరపున అధ్యాపకులు డాక్టర్ పి రాజగోపాల్ మాట్లాడుతూ షేక్స్పియర్ సార్వజనీన రచయిత అని, అతని నాటకాల్లోని అంశాలు, ఇతివృత్తాలు నేటి సమాజానికి కూడా ఎంతో సందేశాన్ని ఇస్తాయని తెలియజేశారు. కళాశాల రాజనీతి శాస్త్ర అధ్యాపకులు శ్రీ కె నరేష్ రాజా మాట్లాడుతూ మనం కదలకుండా ప్రపంచం మొత్తాన్ని చుట్టి రావడానికి అవకాశం కల్పించే గొప్ప ఆయుధమే పుస్తకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వృక్ష శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎన్ .తిరుపతి స్వామి, అధ్యాపకులు డాక్టర్ ఎన్వి శ్రీహరి, డాక్టర్ డి. రామాంజనేయులు, డాక్టర్ జె. హనుమంతరావు, శ్రీ ఎం. లూథర్, శ్రీమతి సిహెచ్.అలేఖ్య తదితరులు పాల్గొన్నారు. కళాశాలలో బిఏ స్పెషల్ ఇంగ్లీష్ చదివి, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏ పూర్తి చేసిన కళాశాల విద్యార్థిని ఎస్కే. షర్ఫున్నీసా మాట్లాడుతూ పుస్తక పఠనం మన యొక్క ప్రపంచాన్ని విస్తృత పరుస్తుందని, ఈ కళాశాలలో అలవాటైన పుస్తక పఠనం ద్వారానే తాను ఎన్నో కొత్త విషయాలను నేర్చుకున్నానని తెలిపారు. ప్రస్తుత విద్యార్థులు కూడా అధ్యాపకులు చెప్పే విషయాన్ని శ్రద్ధగా విని తమ భవిష్యత్తుకు బంగారు బాట వేసుకోవాలని సూచించారు. ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా గత డిసెంబర్లో నిర్వహించిన అంతర్జాతీయ వెబినార్ కు సంబంధించిన వ్యాసాలతో కూడిన పుస్తకాన్ని ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రవికుమార్ సిబ్బంది ఆవిష్కరించారు. కళాశాల తెలుగు, రాజనీతి శాస్త్రం ఆంగ్ల విభాగాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

# వ్యాసరచన ,వకృత్వ, క్విజ్ పోటీలలోని విజేతలకు మెడల్స్ బహూకరణ



**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 23**

జనాభా గణన అంశంపై పాఠశాల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన వకృత్వ , క్విజ్ పోటీలలో విజేతలైన విద్యార్థులకు అల్లినగరం లోని మునుగునూరు వెంకటసుబ్బయ్య అండ్ సన్స్ జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మామిడి పద్మజ మార్కాపురం ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయం నుంచి సరఫరా అయిన మెడల్స్ ను బహుకరించి అభినందించారు. జనాభా గణన అంశంపై జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారిని ఆదేశాల మేరకు పాఠశాల స్థాయిలో ఇటీవల విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ ,క్విజ్ పోటీలను నిర్వహించారు. పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మెడల్స్ బహూకరించి అభినందించాలని కలెక్టర్, డిఈఓ కోరారు. అందుకు అవసరమైన మెడల్స్ ను మార్కాపురం ఉపవిద్యా శాఖ అధికారి కార్యాలయం సరఫరా చేస్తుందని వారు పేర్కొన్నారు. అందులో భాగంగా కొమరోలు మండలం అల్లినగరంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో పోటీలు నిర్వహించారు. పోటీలలో ఆరవ తరగతి చెందిన వి పుష్పత శ్రీ ,ఎం ఖాసిం సుహానా, ఏడవ తరగతి నుంచి ఏ మహబూబ్ జాన్ ,పి రసూల్ బి ,ఎనిమిదో తరగతి నుంచి కే మున్ని,సువర్ణ ,9 తరగతి నుంచి జె యశస్విని, పి యాస్మిన్, కే బ్రహ్మ ప్రియ విజేతలుగా నిలిచారు. వారికి ఆ పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మామిడి పద్మజ, సహోపాధ్యాయులు మెడల్స్ బహూకరించి అభినందించారు. ఆ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# మేదరమెట్ల గ్రామ పంచాయతీకి ప్రతిష్టాత్మక 'ఐఎస్ఓ' గుర్తింపు

## ప్రకాశం జిల్లాలోనే మొదటి 'ఐఎస్ఓ' పంచాయతీగా రికార్డు





**అద్దంకి ఆర్.సి(పెన్ పవర్)ఏప్రిల్ 23**

ప్రకాశం జిల్లా, కొరిశపాడు మండలం, మేదరమెట్ల గ్రామ పంచాయతీ అరుదైన మైలురాయిని అధిగమించింది. నాణ్యమైన పరిపాలన, పారదర్శక సేవలను అందిస్తున్నందుకు గాను ఈ పంచాయతీకి ప్రతిష్టాత్మక 9001:2015 గుర్తింపు లభించింది. విశేషమేమిటంటే.. ప్రకాశం జిల్లా మొత్తం మీద ఈ అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించిన మొదటి గ్రామ పంచాయతీగా మేదరమెట్ల నిలిచింది. ?టాటా ప్రాజెక్ట్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థ 'టీు సర్ట్ సర్వీసెస్' నిర్వహించిన ఈ ఆడిటింగ్‌లో పంచాయతీ పనితీరు అత్యుత్తమంగా ఉన్నట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేరళకు చెందిన ఆడిటర్ హెబిన్ జార్జ్, టెక్నికల్ అసిస్టెంట్ సాయి కృష్ణలతో కలిసి పంచాయతీ అధికారులకు ఈ ప్రతిష్టాత్మక



సర్టిఫికేట్‌ను అందజేశారు.

**గ్రామాభివృద్ధిలో ఇదొక మైలురాయి: పి.డి.ఓ**

ఐ.ఎస్.ఓ సర్టిఫికేట్ సాధించడం పట్ల మేదరమెట్ల గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లక్ష్మీకాంత్ హర్షం వ్యక్తం చేశారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ, రికార్డుల క్రమబద్ధీకరణ, ప్రజలకు సకాలంలో ప్రభుత్వ సేవలు అందించడంలో పాటించిన నాణ్యతా ప్రమాణాల ఆధారంగా ఈ అవార్డును ఖరారు చేశారని తెలిపారు. ప్రకాశం జిల్లాలోనే తొలి ఐఎస్ఓ పంచాయతీగా నిలవడం గర్వకారణమని, మున్ముందు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్యలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో చంద్రశేఖర్, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ రామ్మోహన్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ చైతన్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అజ్ఞానపు చీకట్లను తొలగించే సూర్యోదయం పుస్తకం



**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఏప్రిల్ 23**

ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని నరసం (నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం) ప్రకాశం జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం పుస్తక దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సభకు జిల్లాశాఖ అధ్యక్షురాలు పరాంకుశం కృష్ణవేణి అధ్యక్షత వహించి ప్రసంగిస్తూ ప్రపంచ పుస్తక దినోత్సవం (ప్రపంచ కాపీ హక్కుల దినోత్సవం), ప్రతి సంవత్సరం ఏప్రిల్ 23న ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారని 1995 నుండి నిర్వహించబడుతున్న ఈ ప్రపంచ పుస్తక దినోత్సవం రోజున పుస్తకం చదవడం, ప్రచురించడం, కాపీ హక్కులు వంటి విషయాలను ప్రోత్సహించి వాటి గురించి విస్తృత ప్రచారం చేస్తారని వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు తేళ్ళ అరుణ మాట్లాడుతూ పుస్తకం అనంత భావాల నిధియని,అజ్ఞానపు చీకట్లను చీల్చే సూర్యోదయమని, మనిషిని మనీషిగా మార్చే అక్షరాల ఆయుధమని అన్నారు. నడిపించేదే ఒక మంచి పుస్తకం అని పేర్కొన్నారు. కళామిత్రమండలి (తెలుగు లోగిలి) జాతీయ అధ్యక్షులు డా.నూనె అంకమ్మరావు, నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, నరసం జిల్లా శాఖ కార్యదర్శి రామచంద్రుని లక్ష్మీ, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు కుర్రా ప్రసాద్ బాబు, మారేపల్లి సూర్య కుమారి, కేయస్వీ ప్రసాద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఓరుగంటి ప్రసాద్,కె.బాల కోటయ్య, మిడసల మల్లిఖార్జునరావు,మాగంటి శ్రీనివాసమూర్తి, గుంటూరు సత్యనారాయణ,యు.వి.రత్నం, నూకతోటి శరత్ బాబు, శాంతిలతలను సత్కరించి మంచి పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి యువ కవయిత్రి బీరం అరుణ నిర్వహణ సహకారాన్ని అందించారు.

# వేసవి సెలవుల్లో విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

## కొమరోలు మండల విద్యాశాఖ అధికారి 2 బొర్రా వెంకటరత్నం సూచనలు సలహాలు

**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 23**

మండలంలోని అన్ని యాజమాన్యాల పరిధిలో పనిచేస్తున్న పాఠశాలలకు వేసవి సెలవులను ఈనెల 24వ తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని మండల విద్యాశాఖ అధికారి 2 బుర్ర వెంకటరత్నం తెలిపారు. పాఠశాలలు వేసవి సెలవుల అనంతరం జూన్ 12వ తేదీన పునః ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు .కాగా వేసవి సెలవుల్లో విద్యార్థులు చెరువులు, బావులు, వాగులు, వంకలు, గుంటలు, నదులు తదితర ప్రమాదకర స్థలాల వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకుంటూ నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఉండాలని ఆయన కోరారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా విజ్ఞాన, వినోద సంబంధిత కార్యక్రమాల కొరకు వినియోగించుకునే విధంగా తల్లిదండ్రులు తగు ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు .వేసవి సెలవుల్లో ప్రైవేటు పాఠశాలలు నిర్వహించకూడదని, ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించే పాఠశాలలపై, యాజమాన్యాలపై తగు చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ ఏడాది వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందువల్ల, విద్యార్థులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇళ్ల వద్దనే ఉంటూ ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని, విద్యార్థులు వడగాడ్పులకు గురి కాకుండా తల్లిదండ్రులు తగు చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు ఇళ్ల వద్దనే చల్లని





వాతావరణం లో కాలక్షేపం చేయుటకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆయన కోరారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతు సేవా కేంద్ర సిబ్బందికి,

# ఏపీ సి ఎన్ ఎఫ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం





**అర్ధవీడు వెన్ పవర్ ఏప్రిల్ 23**

అర్ధవీడు మండలంలోని రైతు సేవా కేంద్ర సిబ్బంది మరియు ఏపీ సీఎన్ఎఫ్ సిబ్బందికి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో మొదటి రోజు మాగుటూరు తండా మరియు బసిరెడ్డిపల్లి గ్రామాలలో గురువారం ప్రకృతి వ్యవసాయం చేస్తున్నటువంటి రైతుల పొలాలను సందర్శించడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నటువంటి రైతులు సాగు చేసే విధానాల గురించి వివరించారు వీటిలో భాగంగా ఏటీఎం మెథడ్ నిత్యం 365 రోజులు పంట ఉండే విధంగా ప్రతిరోజు రైతుకు ఆదాయాన్ని ఇస్తుందని తెలియజేశారు. అలాగే పిడిఎస్ మెథడ్ లో భాగంగా విత్తనాలకు బీజామృతం మరియు బంక మట్టి మరియు బూడిద మిశ్రమాలను విత్తనమునకు పట్టించి తొలకరులకు ముందుగా విత్తనాలను పొలంలో చల్లు కోవడం వలన వర్షాలు పడినప్పుడు గింజలు మొలకెత్తి పచ్చిరొట్ట చెరువుగా ఉపయోగపడుతుందని తెలియజేశారు. అదేవిధంగా బసిరెడ్డి పల్లెలో బి.ఆర్.సి సెంటర్లను సందర్శించడం జరిగింది. ఈ సెంటర్ నందు ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాల విత్తనాలు మరియు కషాయాలు మరియు ఘన జీవామృతం వంటి ఉత్పత్తులు రైతులకు సరసమైన ధరలకు అందుబాటులో ఉన్నాయని యజమాని కాట్లావత్ శ్రీనివాస్ నాయక్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి శివలింగ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామ పంచాయతీలలో ప్రకృతి వ్యవసాయం సాగులో ఉందని ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన వనరులను రైతు సేవ కేంద్రాలలో పరిధిలో అందుబాటులో ఉంటాయని ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా ఎలినోవా వర్షా బావ పరిస్థితి నెలకొనే తరుణంలో రైతులు తీసుకోవలసినటువంటి ముందస్తు చర్యల గురించి సిబ్బందికి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని రైతు సేవా కేంద్ర సిబ్బంది మరియు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మాజీ మంత్రి శిద్దా



**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 23**

తిరుమల తిరుపతి కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని శిద్దా రాఘవ రావు కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు, శిద్దా లక్ష్మి పద్మావతి దంపతులు,శిద్దా సుధీర్ కుమార్ దంపతులు గురువారం ఉదయం వి. ఐ.పి బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు.టీటీడీ అధికారులు, అర్చకులు శిద్దా రాఘవరావు దంపతులకు, శిద్దా సుధీర్ కుమార్ దంపతులకు, రంగ నాయక మండపంలో వేద ఆశీర్వాదం తో పాటుగా స్వామి వారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు అందచేశారు.

## గిద్దలూరులో ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 23**

గిద్దలూరు పట్టణంలోని ముండ్లపాడు రోడ్డులో శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. రాష్ట్రంలో ఎన్.డి.ఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, భగీరథ మహర్షి జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేయడం పై సగర సామాజిక వర్గం హర్షం వ్యక్తం చేసింది. ఈ జీవో ద్వారా ప్రభుత్వం పండుగను అధికారికంగా నిర్వహించడం తమ జాతికి దక్కిన గొప్ప గౌరవమని నాయకులు పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక వేడుకల్లో గిద్దలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య, రాష్ట్ర సగర సంఘం కార్పొరేషన్ డైరెక్టర్ ఆరేపల్లి మల్లికార్జున్, మాజీ సర్పంచ్ దప్పిలి భాస్కర్ రెడ్డి, టీడీపీ నాయకులు శ్రీ దప్పిలి కాశి రెడ్డి 11వ వార్డు కౌన్సిలర్ శ్రీ లొక్కు రమేష్ , పట్టణ టీడీపీ నాయకులు శ్రీ మండ్ల శ్రీను, శ్రీ సంపత్ కుమార్ రెడ్డి, శ్రీ బోయిలపల్లి కిషోర్, శ్రీ బద్రి భాష, తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేసి భగీరథ మహర్షికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమం గిద్దలూరు - రాచర్ల మండలాల అధ్యక్షులు గిద్దలూరు మద్దులేటి సగర సంఘం సభ్యుల ఆధ్వర్యంలో క్రమశిక్షణతో సాగింది. వేడుకలకు భారీగా తరలివచ్చిన సగర బంధువులకు, మహిళలకు , అతిథులకు నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భగీరథ మహర్షి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటూ, ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

## ఘనంగా పోలేపల్లి పాఠశాల వార్షికోత్సవం



**దొనకొండ ఏప్రిల్ 23 పెన్ పవర్**

మండలంలోని పోలేపల్లి లోమండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల నందు ప్రధానోపాధ్యాయులు ఆదిమూలపు ప్రభుదాస్ ఆధ్వర్యంలో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు నృత్యాలు మరియు సామాజిక అంశాలపై ప్రదర్శించిన స్కిట్లు విశేషంగా ఆకట్టుకున్నాయి కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా మండల విద్యాశాఖ అధికారులు 1 ఎన్ సాంబ శివరావు 2 షేక్ అమీర్ దొనకొండ మరియు చందవరం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు వి వి రామాంజనేయులు, వై వి సుబ్బారావు పాల్గొన్నారు. కార్యక్రమంలో అతిథులు మాట్లాడుతూ మండలం లోని ఈ పాఠశాల కు మంచి గుర్తింపు ఉందని , పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. పోలేపల్లి గ్రామస్తులు బెజవాడ డేవిడ్ విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అతిథులకు భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదిమూలపు ప్రభుదాసు ధన్యవాదాలు తెలిపారు.

## వైభవంగా సీతా రాముల దేవస్థానంలో వార్షికోత్సవ వేడుకలు

### కనులవిందుగా సీతా రాముల కల్యాణం -అలరించిన కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు

### గురువారం అంకాలమ్మ , పోలేరమ్మలకు బోనాలు





**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 23**

గిద్దలూరు మండలం తంబల్ల పల్లి లో సీతారామసమేత లక్ష్మణ ,ఆంజనేయస్వామి ఆలయంలో గత మూడురోజులుగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగ బుధవారం నాడు స్వామివారి కల్యాణం కమణీయంగా , కనులవిందుగా నిర్వహించారు. కాకుండా హోమాది కార్యక్రమాలు జరిగాయి . కల్యాణ రాముని గ్రామోత్సవం అంరంగవైభవంగా నిర్వహించారు . ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. గ్రామంలో పండుగ , ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది . స్వామివారి గ్రామోత్సవంలో ఏర్పాటుచేసిన కోలాటం , వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలువురు నియోజకవర్గ నాయకులు స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారమ నాడు మహిళలు అంకాలమ్మ , పోలేరమ్మ లకు బోనాలు సమరపించారు. బాజా భజంత్రీలు మేల తాళాలు మధ్య బోనాలఉత్సవం సాగింది గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని గ్రామ దేవతలకు పూజాధికార్యక్రమాలు నిర్వహించి అమ్మవార్లకు పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించారు . మూడురోజులు వైసిపి నాయకులు కాముని రమణారెడ్డి అన్న ప్రసాదావితరణ చేశారు. గిద్దలూరు శాసన సభ్యులు అశోక్ రెడ్డి, కృష్ణ కిషోర్ రెడ్డి వైసిపి నాయకులు పిడతల కుమార్ రెడ్డి , నాగార్జునరెడ్డి తదితరులు స్వామిని దర్శించుకున్నారు.

## పొదిలిలో ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టిన ఎస్ ఐ రాజేష్



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 23**

పొదిలిలో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఎస్ ఐ రాజేష్ ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టారు. అందులో భాగంగా గురువారం నాడు ఎస్ ఐ రాజేష్ పట్టణ శివారులోని మార్కాపురం అడ్డరోడ్డు మలుపు వద్ద కాన్వెక్స్ మిర్రర్ ఏర్పాటు చేశారు. దీంతో మలుపుల వద్ద అవతలి వైపు నుండి వచ్చే వాహనాలు స్పష్టంగా కనిపిస్తాయి. అందువల్ల డ్రైవర్లు ముందే జాగ్రత్తలు తీసుకొని ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఇరుకైన మలుపుల్లో ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎస్ ఐ రాజేష్ చెప్పారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, పొదిలి సీఐ రాజేష్ కుమార్ సూచనల తో భద్రతా చర్యలను తీసుకోవడం జరిగిందని ఎస్ ఐ రాజేష్ చెప్పారు.

## అనంతబాబును వెంటనే అరెస్టు చేయాలి

### తెలుగుదేశం ఎస్సీ నేత మల్లికార్జున

**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 23**



డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసులో ప్రధాన నిందితుడు మాజీ ఎమ్మెల్సీ అనంత బాబును వెంటనే అరెస్టు చేయాలని మండల తెలుగు దేశం ఎస్సీ విభాగపు అధ్యక్షులు జ్యోతి మల్లికార్జున డిమాండ్ చేశారు. సుబ్రహ్మణ్యం హత్య కేసులోని సాక్షులను అనంతబాబు ప్రభావితం చేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడుతున్నారని, అందువల్ల ప్రభుత్వం ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి అనంతబాబు బెయిల్ ను రద్దు చేసి, వెంటనే అరెస్టు చేయాలని మల్లికార్జున కోరారు. అందువల్ల డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసు లో పూర్తి న్యాయం జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి మాజీ ఎమ్మెల్సీ అనంత బాబును అరెస్టు చేయడం ద్వారా కేసులోని నిజా నిజాలు బహిర్గతం జరిగేలా చర్యలు తీసుకోవాలని మల్లికార్జున కోరారు.

## జనభా గణనకు ప్రజలందరూ సహకరించాలి

### తహసిల్దార్ ఆంజనేయ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 23**

భారత ప్రభుత్వం,జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు జనభా గణన-2027 ప్రక్రియపై ఎన్యుమరేటర్లకు, సూపర్వైజర్లకు మూడు రోజుల పాటు సమగ్ర శిక్షణా కార్యక్రమం గురువారం గిద్దలూరులోని ఎంపీడీవో కార్యాలయం లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గిద్దలూరు మండల తహసిల్దార్ (ఛార్జ్ ఆఫీసర్) ఆంజనేయ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే 2027 జనభా గణన దేశంలోనే మొట్టమొదటి పూర్తిస్థాయి డిజిటల్ సెన్సస్ అని, దీనిని అత్యంత ఖచ్చితత్వంతో నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. శిక్షణలోని ప్రధానాంశాలను వివరిస్తూ డిజిటల్ "హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్" మొబైల్ యాప్ వినియోగంపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. డేటాను ఆన్లైన్లో నమోదు అంశాలపై ప్రత్యక్ష ప్రదర్శన ఇచ్చారు. గృహ గణనలో భాగంగా ఇంటి పరిస్థితి, ఇంట్లోని వసతులు, ఆస్తుల వివరాలను సేకరించే 34 రకాల ప్రశ్నలపై వివరణ ఇచ్చారు. స్వీయ గణన ప్రజలు తమ వివరాలను తామే ఆన్లైన్లో నమోదు చేసుకునే 'సెల్ఫ్ ఎన్యుమరేషన్' విధానం గురించి సిబ్బందికి వివరించారు. ప్రతి ఇంటిని సందర్శించి, ఏ ఒక్క కుటుంబాన్ని వదలకుండా వివరాలు సేకరించాలని సూచించారు. సూపర్వైజర్లు అందరూ తమ పరిధిలోని ఫీల్డ్ వర్క ను హెచ్.యల్. ఓ యాప్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జాతీయ ప్రాముఖ్యత కలిగిన ఈ పనిని ఖచ్చితత్వంతో చేయాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని మూడు రోజులపాటు సమర్థవంతంగా నిర్వహించిన మాస్టర్ ట్రైనీలు డాక్టర్ మొర్రి. పిచ్చయ్య, యం. బాల గురవయ్య, రామచంద్రా రెడ్డి లను అభినందించి దుశ్శాలువతో, జ్ఞాపిక తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ భాస్కర రావు, మండల అసిస్టెంట్ స్టాటిస్టిక్స్ ఆఫీసర్ ఎం.డి ఫరీదా, రెవిన్యూ సిబ్బంది పాల్గొని శిక్షణ తరగతులు సజావుగా జరగడానికి సహకరించారు. జనభా గణన 2027 విజయవంతం కావడానికి గిద్దలూరు మండల ప్రజలు తమ వద్దకు వచ్చే అధికారులకు సరైన సమాచారం అందించి సహకరించాలని మండల తహసిల్దార్ ఆంజనేయ రెడ్డి కోరారు.

## భూ సమస్యల పరిష్కారం కోసం రెవిన్యూ గ్రామ సభలు



**పొన్నలూరు పెన్ పవర్ ఏప్రిల్ 23**

మండలంలోని ఉప్పలదిన్నె పంచాయతీ కార్యాలయంలో గురువారం రెవిన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పుల్లారావు మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవిన్యూ గ్రామసభలను రైతులంతా వినియోగించుకోవాలని తెలిపారు.సర్వే ప్రక్రియలో, ప్రతి దశలోనూ రైతుల ఆమోదం తప్పనిసరి, గ్రామంలోని రైతులకు సర్వేపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండ్రగుంట శ్రీనివాసులు, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షుడు కొండ్రగుంట నరసయ్య, పి మాల్యాద్రి, వ్యవసాయ అధికారి వి రాము, సర్వేయర్ గోపిరెడ్డి, ఆర్ ఐ శివ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే చిన్నారులకు భవిష్యత్తు..!

### -సూపర్వైజర్ దేవీ బాయ్

**పుల్లల చెరువు పెన్ పవర్ ఏప్రిల్ 23**



పుల్లల చెరువు మండలం గంగవరం గ్రామంలోని అంగన్వాడీ మెయిన్ సెంటర్లో 8వ పోషణ పక్వాడా కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్నారుల సమగ్ర విద్యాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామంలో విద్యాపట్ల అవగాహన పెంపొందించడంలో కీలకంగా నిలిచింది. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్ దేవీ బాయ్ మాట్లాడుతూ చిన్నారులకు చిన్ననాటి నుంచే విద్యపై ఆసక్తి పెంచడం అత్యంత అవసరమని అన్నారు.మానసిక, శారీరక అభివృద్ధికి ప్రాథమిక విద్య పునాది వంటిదని, బాల్యంలోనే మంచి అలవాట్లు అలవరచి, విద్యపై దృష్టి సారిస్తే భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించడం సులభమవుతుందని అన్నారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో 5 సంవత్సరాలు పూర్తయిన చిన్నారులను పాఠశాలలో చేర్పించే నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న చిన్నారుల తల్లిదండ్రులను ప్రత్యేకంగా ఆహ్వానించి, తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో నమోదు చేయించాలని ప్రోత్సహించారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులకు పిల్లల పోషణ, ఆరోగ్య సంరక్షణ, విద్యాపట్ల బాధ్యతలపై అవగాహన కల్పించారు. చిన్నారుల భవిష్యత్తు బలంగా ఉండాలంటే ప్రారంభ దశ నుంచే సరైన దిశలో విద్య అందించాల్సిన అవసరం ఉందని వివరించారు.గ్రామంలోని తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని తమ పిల్లల విద్యపై ఆసక్తి కనబరిచారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సావిత్రి,వెంకటమ్మ,శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

# శ్రీ హజరత్ ఖాదర్ వలి స్వామి దర్గాకు సి.సి కెమెరాలు

## బీజేపీ నాయకులు



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 23**

భారతీయ జనతా పార్టీ గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యం లో బీజేపీ సీనియర్ నాయకులు దప్పిలి వినోద్ కుమార్ రెడ్డి. ముండ్లపాడు రోడ్ లో గల ఖాదర్ వలి దర్గాకు ముప్పై వేల రూపాయలు విలువ గల సి సి కెమెరాలు బహుకరించారు. ఈ సందర్భంగా పట్టణ బీజేపీ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు భవనాషి వెంకట రామాంజనేయులు మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం లో దప్పిలి వినోద్ కుమార్ రెడ్డి కుటుంబం ముందుంటుంది అని ఆ భగవంతుడు ఆ కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉండాలని వారి కుటుంబం మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆశిస్తున్నానన్నారు. ఈ క్రమంలో సీనియర్ నాయకులు పిడతల రమేష్ రెడ్డి,మాజీ జిల్లా కార్య వర్గ సభ్యులు ముప్పూరి శ్రీనివాసులు,మార్కెట్ యార్డ్ బోర్డు సభ్యులు బాదుల్లా, జిల్లా ఎస్ సి మోర్చా ప్రధాన కార్యదర్శి మట్టే మల్ల పుల్లయ్య,వేమూరి శ్రీనివాసులు , నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానం బోర్డు కొప్పుల నరసింహులు,మరియు ఖాదర్ వలి దర్గా కమిటీ సభ్యులు అధ్యక్షులు లతీఫ్ ఖాన్,ఉపాధ్యక్షులు షేక్ షుకూర్, సెక్రటరీ వై పి ఖాన్, కమిటీ సభ్యులు రజాక్, షేక్ బాషా పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఆంగ్ల దినోత్సవ వేడుకలు




**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఏప్రిల్ 23**

స్థానిక శ్రీ సాయిచారాజి హైస్కూల్లో ప్రపంచ ఆంగ్ల దినోత్సవ వేడుకలు ఘనంగ నిర్వహించారు. విద్యార్థులకు ఆంగ్ల ఉపాధ్యాయులు ఆంగ్లభాష యొక్క గొప్పతనాన్ని వివరించారు. నికఫల్ మస్తాన్వలి. మాట్లాడుతూ ఆంగ్ల భాష ప్రస్తుత సమాజంలో శ్రధమ జ్ఞానాన్ని కైవసం చేసుకుంది అని అన్నారు. పాఠశాల డైరెక్టర్ పి. ప్రకాశరావు పాఠశాలలోని ఆంగ్ల ఉపాధ్యాయులను ఘనంగ దుశ్శాలువాతో సత్కరించారు.

# ప్రజా రక్షణే ధ్యేయం ప్రమాదకర మలుపు వద్ద కాన్వెక్స్ మిర్రర్ ఏర్పాటు -ఎస్ఐ పి. కోటేశ్వరరావు

**గిద్దలూరు(రాచర్ల)పెన్ పవర్ ఏప్రిల్ 23**

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రాచర్ల సబ్ ఇన్స్పెక్టర్ పి. కోటేశ్వరరావు మరో కీలక అడుగు వేశారు. జిల్లా ఎస్పీ .. ఆదేశాలను పాటిస్తూ, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడంలో తనదైన ముద్ర వేస్తున్నారు. సమస్యను గుర్తించి.. వెనువెంటనే తగిన చర్యలు చేపట్టారు. రాచర్ల మండల పరిధిలోని మోడల్ స్కూల్ సమీపంలో ఉన్న మలుపు అత్యంత ప్రమాదకరంగా మారిందని గుర్తించిన ఎస్ఐ , బుధవారం అక్కడ కాన్వెక్స్ మిర్రర్ ను ఏర్పాటు చేశారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక పోవడం వల్ల ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గమనించి, ఈ పరిష్కారాన్ని అమలు చేశారు. సాంకేతికతతో భద్రత ఈఅద్దం వల్ల మలుపు అవతలి వైపు నుండి వచ్చే వాహనాలను డ్రైవర్లు ముందే గుర్తించే వీలుంటుందని ఆయన వివరించారు. ఈసందర్భంగా ఎస్ఐ పి. కోటేశ్వరరావు , మాట్లాడుతూ కేవలం సౌకర్యాలు కల్పిస్తే సరిపోదని, వాహనదారుల బాధ్యత కూడా ముఖ్యమని పేర్కొన్నారు. అతివేగం ప్రాణాంతకమని, నియంత్రిత వేగంతో ప్రయాణించాలని హెచ్చరించారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకుని, ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్న ఎస్ఐ పి. కోటేశ్వరరావు , పనితీరుపై స్థానికులు ,మోడల్ స్కూల్ సిబ్బంది ప్రశంశిస్తున్నారు.




# గిరిజన జాతుల సంక్షేమం, అభివృద్ధికై ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు

## - ఎస్టీ కమిషన్ చైర్మన్ సొల్లా బొజ్జి రెడ్డి

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 23**

గిరిజన జాతుల సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చినట్లు ఎస్టి కమిషన్ చైర్మన్ సొల్లా బొజ్జి రెడ్డి తెలిపారు. గురువారం ఒంగోలు, కొత్తపట్నం మండలాల్లో ఎస్. టి కమిషన్ సభ్యులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్.టి కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో ఎస్.టి బిడ్డలు ఎదుర్కొంటున్న కొన్ని సమస్యలు తమ దృష్టికి వచ్చాయని ,వారు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రత్యక్షంగా చూసి,విని ఆ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కొత్తపట్నం మండలం రంగాయపాలెంలో గత సంవత్సరం డిసెంబర్ 8 వ తేదీన వేటకు వెళ్లి కాలువలో పడి మరణించిన ఎ.బాల నాగు కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. బాలనాగు మరణించిన తీరును ఆయన తెలుసుకుని వెంటనే కేసు నమోదు చేయాలని చైర్మన్, పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నుండి ఆ కుటుంబానికి రావాల్సిన ప్రయోజనాలను వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులకు చెప్పారు. వీరికి అందించే ప్రయోజనాల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. అత్యధికంగా ఎస్.టి లకు ఆధార్ కార్డుల లేవని తమ దృష్టికి వచ్చిందని వెంటనే ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డులు అందజేయాలన్నారు. అదేవిధంగా పుట్టిన తేదీ సర్టిఫికెట్ లు, రేషన్ కార్డులు వంటివి వారికి అందేలా ప్రత్యేక చర్యలు



తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కొత్తపట్నం మండలం మోటుమాల గ్రామ పరిధిలోని ఎస్. టి లు చేపలు పట్టే బకింగ్ కెనాల్ కాలువను ఆయన సందర్శించారు. అక్కడ చేపలు పట్టే గిరిజనులతో ఆయన మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. చేపలు పట్టడానికి లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నామని , ఫిషరీస్ డిపార్ట్మెంట్ వారు ఇంకా వాటిని పరిశీలించలేదని తాము ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే స్పందించిన చైర్మన్ చేపల వేటకు వృత్తిగా ఉన్న వారికి ప్రభుత్వం ఇచ్చే లైసెన్సులు లేదా రాయితీల కోసం నిర్వహించే ఫిషర్మేన్ స్కిల్ టెస్ట్ వెంటనే నిర్వహించి వారికి లైసెన్సులు అందజేయాలన్నారు. ఈ లైసెన్సులు ఉండటం వల్ల ఈ కుటుంబాలకు ప్రభుత్వం అందించే భీమా, ప్రభుత్వ పథకాలు, సొసైటీ లో సభ్యత్వం పొందటానికి వీలుగా



ఉంటుందన్నారు.వీరి విషయంలో నిర్లక్ష్యం వహించరాదని ఆయన చెప్పారు. ప్రతి ఒక్కరు ధైర్యంగా ఉండాలని, మీ సమస్యలని పరిష్కరించడానికి ప్రభుత్వం ఎస్.టి కమిషన్ ఏర్పాటు చేసి మీ దగ్గరకే వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నారని ఆయన చెప్పారు. అంతకు ముందు ఒంగోలు లోని జయ ప్రకాష్ కాలనీ లో ఆయన పర్యటించి అక్కడ ఎస్. టీ ల సమస్యలు తెలుసుకున్నారు.అక్కడ రోడ్డు విషయంలో కొంత మంది ఇబ్బంది పెడుతున్నారని సంఘ నాయకులు ఆయన దృష్టి కి తీసుకువచ్చారు. ఆ రోడ్డు విషయం త్వరగా పరిష్కరించి వారికి న్యాయం చెయ్యాలని సంబంధింత అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పర్యటనలో ఆయన వెంట ఎస్.టి కమిషన్ సభ్యులు కద్రక. మల్లేశ్వర రావు ,? కాకి లక్ష్మి ,?పి. వెంకటప్ప ,?కట్టా సాంబయ్య డిప్యూటీ డైరెక్టర్, అర్. డి. ఓ లక్ష్మీప్రసన్న , జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి వరలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

# సి ఎస్ పురం జడ్ పి పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం





**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 23**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఖాదరున్నీసాబేగం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మండల తహాశీల్దార్ కె.వి. ప్రసాద్, ఎంపీడీవో వి. ప్రతాపరెడ్డి, ఎంఈఓ-1 జె. ప్రసాదరావు, మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్, మాజీ ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య, నీటి సంఘం ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు పఠన్ ఖాజా, విద్యా కమిటీ చైర్మన్ షేక్ హుస్సేన్ బి, వైస్ చైర్మన్ బత్తుల మోహన్ రావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమాలలో గెలుపొందిన విద్యార్థులకు మెడల్ మొమెంటో అందజేశారు మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని ఎన్డిఏ కూటమి ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యమిస్తూ ఉచితంగా పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం, విద్యా సామాగ్రి, విద్యార్థి తల్లిదండ్రులకు తల్లికి వందనం పథకం ద్వారా రూ 20 వేల రూపాయలు ఆర్థిక భరోసా వంటి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు సమాజానికి బలమైన పునాదిగా నిలుస్తాయని, గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలను పెంచడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని కొనియాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.అలాగే ప్రతి విద్యార్థి పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు కావడం చాలా అవసరమని తెలిపారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలని, పాఠశాల అభివృద్ధికి గ్రామస్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి పనిచేస్తే మరింత మంచి ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. ఎంఈఓ జె ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రతి విద్యార్థి ప్రతిభను వెలికి తీసే విధంగా పాఠశాలలో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ ఖాదరున్నీసాబేగం మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు ఎండలో తిరగకుండా ఇంటి వద్దనే ఉండి రాబోయే తరగతులకు సంబంధించిన పాఠ్యాంశాలను చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పెట్టే అన్నం ఇంత దరిద్రమా

## ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే తాటిపర్తి



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ ఏప్రిల్ 23**


ఆరోగ్యం బాగులేక ప్రభుత్వఆసుపత్రికి వచ్చిన రోగులకు అందించవలిసిన భోజనం నాశిరకంగాఅందిస్తారా, మీరు కూడా ఇలాగే తింటారా రోగులకు పెట్టే భోజనం ఇంత గోరమా అంటు వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మండిపడ్డారు. స్థానిక ప్రభుత్వవైద్యాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఆసుపత్రి లోని ప్రతి వార్డును క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రి లో రోగులకు అందుతున్న సేవలాగురించి అడిగి తెలుసుకున్నారు. నిత్యం అధిక సంఖ్యలో వచ్చే రోగులకు సరైన సమయంలో భోజనం అందడం లేదని, నాశిరకంగా ఉందని పరిశుభ్రత లేదని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు, ప్రభుత్వఆసుపత్రి లోని పలు విషయాలపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసి సూపరిండెంట్, సిబ్బంది పని తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసారు. ఆసుపత్రి లో రోగులకు అందించ్చాలిసిన కనీస సదుపాయాలు సరిగా లేవని, పూర్తిగా వ్యవస్థ నీర్వీర్యం అయ్యిందని అన్నారు. నేను మళ్ళీ ఆసుపత్రిని తనిఖీ చేస్తానని రోగులకు అందించ్చాలిసింది భోజన సదుపాయం వైద్యుల పనితీరుమారాలని హెచ్చరించారు. ప్రభుత్వం ఆసుపత్రులను బలోపేతం చేయవల్సిన బాధ్యతను విస్మరించి, నిర్వీర్యం చేసే విధంగా కూటమి పాలన కొనసాగుతుందని విమర్శించారు. చంద్రబాబు పాలనలో ఆరోగ్య రంగం ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుతుందని గ్రామీణ స్థాయిలో ప్రజలకు కనీస వైద్య సేవలు అందడంలేదని అన్నారు. ఆరోగ్య పరిరక్షణ కోసం వచ్చే ప్రజలకు వైద్య సేవలు అందక పోవడం దురదృష్టకారమని ప్రజల నుండి వ్యతిరేక ఎదుర్కొకతప్పదని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఏకుల ముసలారెడ్డి, జడ్పీటీసీ చేదురి విజయభాస్కర్, అరుణబాయి తదితరులు పాల్గొన్నారు.

# విధులకు అడ్డంకులు కలిగించారని ఫిర్యాదు

## చర్యలు తీసుకోవాలని తహాశీల్దార్‌కు నివేదిక సమర్పించిన వీఆర్వో మాల్యాద్రి

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 23**

మండలంలోని నల్లమడుగుల గ్రామ కాపరస్తుడు సూరిపోగు సామేల్ విధులకు అటంకాలు కలిగిస్తున్నారని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇంచార్జి గ్రామ రెవెన్యూ అధికారి కె. మాల్యాద్రి గురువారం మండల తహాశీల్దార్ కె.వి. ప్రసాద్ కు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ గురువారం ఉదయం సుమారు 11 గంటల సమయంలో గ్రామ సచివాలయానికి వెళ్లిన అనంతరం పీజీఆర్ఎస్ అర్జీ విషయమై సామేలు ఫోన్ చేసి సచివాలయం వద్దకు రమ్మని కోరినట్లు తెలిపారు. అనంతరం అతను అక్కడికి వచ్చి సమస్యపై చర్చించేందుకు ప్రయత్నిస్తుండగా అనవసరంగా వాగ్వాదానికి దిగాడని,నువ్వు


Forwarded to the S.H.O, C.S.Puram to take necessary action immediately.
TAHSILDAR C.S.PURAM MANDAL MARKAPURAM DL
20/4/2026
Cell 9676824958

ఎవరు, నీకు ఇంచార్జి వీఆర్ ఓగా ఆదేశాలు ఎవరు ఇచ్చారు" అంటూ అసభ్యకరంగా ప్రవర్తిస్తూ గట్టిగా కేకలు వేయడంతో పాటు అవమానకరంగా మాట్లాడారని అన్నారు ఈ ఘటనతో తన విధులకు ఆటంకం కలగడంతో పాటు అవమానానికి గురయ్యానని ,ప్రభుత్వ ఉద్యోగిగా విధులు నిర్వహించడంలో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమని, సంబంధిత వ్యక్తిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహాశీల్దార్ కె వి ప్రసాద్ కు నివేదిక అందజేసినట్లు తెలిపారు.

# పోషణ పక్వాడ కార్యక్రమం



**దొనకొండ ఏప్రిల్ 23 పెన్ పవర్**

మండలంలోని ఆరవెళ్లపాడు సెక్టర్ పెద్ద గుడిపాడుఅంగన్వాడి సెంటర్ నందు సూపర్వైజర్ సిహెచ్ సుభాషిని ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించడం జరిగినది కార్యక్రమంలో భాగంగా సిహెచ్ సుభాషిని మాట్లాడుతూ పిల్లలు ఫోన్ మరియు టీవీ కి దూరంగా ఉంచాలి అని జీరో టు త్రీ ఇయర్స్ పిల్లలు అభివృద్ధి ఈ వయసులోనే ఎక్కువ శాతం జరుగుతుంది అని పేర్కొన్నారు అలాగే జంక్ ఫుడ్ ను దూరం చేసి చిన్నారులకు సెల్ ఫోన్ ఇవ్వకుండా తల్లిదండ్రులు అమ్మమ్మ నాన్నమ్మ తాతయ్యలు వారితో సమయం వెచ్చించాలని ఇంట్లో తయారు చేసుకునే ఆహారంలో ఎన్నో పోషక విలువలు ఉంటాయని బయట ఆహారం చిన్నారులకు సెల్ ఫోన్ ఇవ్వకుండా తల్లిదండ్రులు అమ్మమ్మ నాన్నమ్మ తాతయ్యలు వారితో సమయం వెచ్చించాలని తల్లిదండ్రులతో 0-3 సంవత్సరాల పిల్లలకు రాగి జావా రాగులతో ఆకుకూరలు కలిపి రొట్టె తయారు చేయించడం జరిగినదిఇంట్లో తయారు చేసుకునే ఆహారంలో ఎన్నో పోషక విలువలు ఉంటాయని బయట ఆహారంలో ఊబకాయంహెల్తి ఫుడ్ పిల్లలకు అలవాటు చేయాలి అని ముఖ్యంగా ప్యాకెట్లలో ఉండే పదార్థాలు పిల్లలకు ఇవ్వకుండా ఉండాలి అని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జె రాణి ఏ పద్మ ఆయా ఆర్ అరుంధతి ఆశా కార్యకర్త వి జయంతి గ్రామాలలోని పిల్లల తల్లిదండ్రులు పాల్గొనడం జరిగినది.

# పాపినేనిపల్లె గ్రామంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం





**అర్ధవీడు, పెన్ పవర్, ఏప్రిల్ 23**

మండలంలోని పాపినేనిపల్లె గ్రామంలో పోషన్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. పాపనిపల్లి గ్రామంలోని 147 అంగన్వాడి కేంద్రంలో సూపర్వైజర్ డి రంజాబి ఆధ్వర్యంలో గరువారం పోషన్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మెదడు అభివృద్ధికి ప్రారంభ దశ ప్రేరణ. 0-3 సంవత్సరాలు పిల్లలకు అవసరమని తల్లి గర్భవతిగా ఉన్నప్పటి నుండి బిడ్డకు మూడు సంవత్సరాలు వచ్చే లోపు మెదడు 80 శాతం అభివృద్ధి చెందుతుందన్నారు. కావున పిల్లలకు తల్లి బిడ్డల పరస్పర చర్యలు, ప్రదర్శనల ద్వారా స్థానికంగా లభ్యమయ్యే వస్తువులతో ఆట ఆధారితం. భాషకు సంబంధించిన అభివృద్ధిల గురించి తెలియజేశారు. తల్లులు వీటితో బిడ్డ ఎదుగుదల సరైన పోషకాహారం కూడా అవసరమని తెలియజేయడం జరిగింది. పిల్లలకు జింక్ ఫుడ్ కు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ పి కోటేశ్వరి, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# వరల్డ్ మాస్టర్ స్పోర్ట్స్ విజేత డోలా శ్యామలకు ఘన సన్మానం



మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఏప్రిల్ 23

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలు డోలా. శ్యామలాదేవి ఇటీవల థాయిలాండ్ దేశంలో జరిగిన వరల్డ్ మాస్టర్ స్పోర్ట్స్ లో పాల్గొని మహిళల విభాగంలో హై జంప్ లో బంగారు పతకం, ట్రిపుల్ జంప్ లో బంగారు పతకం, మొత్తం రెండు బంగారు పతకాలు గెలుపొందడం జరిగింది. ఈ అభినందన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మార్కాపురం మండల తహసిల్దారు కె.చిరంజీవి మరియు మార్కాపురం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి యం.శ్రీనివాసులు.. మండల విద్యాశాఖాధికారి కె.శర్వాణి తదితరులు హాజరయ్యారు. అనంతరం వారు వరల్డ్ మాస్టర్ స్పోర్ట్స్ విజేతను దుశ్శాలువ,మెడల్స్,మెరిట్ సర్టిఫికెట్ తొ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయురాలు అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ప్రాతినిధ్యం వహించి రాణించటం గర్వకారణం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సహ వ్యాయామ ఉపాధ్యాయులు పి. దామోదర రెడ్డి, కె.ఓబులేసు లతో పాటు ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొని, ఆమెను సన్మానించడం జరిగింది. ఇందులో ఎన్.సి.సి, స్కౌట్ విద్యార్థులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



## గజ్జలకొండ అథ్లెట్ నాసరయ్యకు అభినందన వెల్లువ

మార్కాపురం పెన్ పవర్ ఏప్రిల్ 23



మార్కాపురం జిల్లా గజ్జల కొండ ఎస్.సి.పాలెం కు చెందిన జముల్లముడి నాస రయ్య అంతర్జాతీయ వేదికపై ప్రతిభ కనబరిచి స్వగ్రామానికి కీర్తి తెచ్చిన సంగతి తెలిసిందే. థాయిలాండ్‌లో నిర్వహించిన వరల్డ్ మాస్టర్స్ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్--2026లో ఆయన 5000 మీటర్ల వాకింగ్ రేస్‌లో ద్వితీయ స్థానం, 100 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం సాధించి ప్రశంసలు అందుకున్నారు. ఈ సందర్భంగా నాసరయ్య స్వగ్రామం గజ్జలకొండకు చేరుకోగా గ్రామ ప్రజలు, క్రీడాభిమానులు అతనికి ఘన స్వాగతం పలికారు. గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తూ వాయిద్యాల నడుమ అతనిని ఆహ్వానించి, ఆనందోత్సాహాలతో స్వాగతించారు. అనంతరం గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి నాసరయ్యను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. సాధారణ కుటుంబ నేపథ్యంతో అంతర్జాతీయ స్థాయిలో విజయం సాధించిన నాసరయ్య గ్రామ యువతకు ఆదర్శంగా నిలిచారని గ్రామస్తులు పేర్కొన్నారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## గాయత్రి హాస్పిటల్, అరుదైన చికిత్స -డాక్టర్ బ్రహానంద రెడ్డి

నరసరావుపేట, పెన్ పవర్ ఏప్రిల్ 23



పందిళ్ళపల్లి గ్రామానికి చెందిన మర్తాల సరస్వతి కి థైరాయిడ్ వ్యాధి కారణంగా శస్త్రచికిత్స అవసరమైంది. అయితే ఆమెకు మానసిక సమస్యలు (సైకియాట్రిక్ ఇష్యూస్), ఎపిలెప్సీ (మూర్ఛ వ్యాధి) ఉండటం వల్ల, ఈ కేసు హై రిస్క్ గా పరిగణించి నరసరావుపేట, వినుకొండ ప్రాంతాల్లోని కొన్ని ఆసుపత్రులు శస్త్రచికిత్స చేయడానికి నిరాకరించాయి. అయితే ఈ క్లిష్ట పరిస్థితిని గిద్దలూరు గాయత్రి హాస్పిటల్, బాధితులు సంప్రదించారు . వైద్య శాల వైద్యులు డాక్టర్ బ్రహానంద రెడ్డి ఒక సవాలుగా స్వీకరించి నిపుణుల బృందం ఆధ్వర్యంలో సమగ్ర జాగ్రత్తలతో శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించారు. ప్రస్తుతం సరస్వతి శస్త్రచికిత్స అనంతరం కోలుకొని ఆరోగ్యంగా తన దైనందిన పనులను స్వయంగా చేసుకునే స్థితికి చేరుకున్నారు. ఈ విజయవంతమైన చికిత్స గాయత్రి హాస్పిటల్ నైపుణ్యం, సమన్వయం పేషేంట్ పట్ల ఉన్న అంకితభావానికి నిదర్శనంగా భావిస్తున్నారు. డాక్టర్ బ్రహానంద రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాల నిర్వహిచి వివిధ వ్యాధులకు ఉచిత పరీక్షలు చేసి , ఉచితంగా మందులు ఇస్తూ రోగాల పట్ల అవగాహన కల్పిస్తూన్నారు. డాక్టర్ గతంలో రు 10 ల డాక్టర్లుగా పేరు ప్రఖ్యాతులు గడించారు. మార్ధాల సరస్వతి ఆరోగ్యం మెరుగు పడి దైనందిన పనులు చేసుకుంటుండటం తో ఆమె కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆయన సతీమణి కూడా గైనకాలజీ లో సిద్ధహస్తు రాలు అమెకూడా ఎన్నో కష్ట తరమైన కేసులను కూడా సునాయాసంగా కాన్పులు , శాస్త్ర చికిత్సలు చేస్తున్నారు.

## భగీరథ మహర్షికి జిల్లా కలెక్టర్ ఘన నివాళులు


స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 23



పట్టుదల దీక్షకు మారుపేరు మహర్షి భగీరథుడని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అన్నారు. భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకొని ఒంగోలులోనీ కేశవ స్వామి పేటలో ఉన్న ఆయన విగ్రహానికి జిల్లా కలెక్టర్ రాజాబాబు, పలు సంఘాల ప్రతినిధులు, జిల్లా అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజాబాబు, మీడియాతో మాట్లాడుతూ, గంగను దీని నుంచి భూమికి దింపిన మహనీయుడు భగీరథుడని, మనం ఏదైనా ప్రయత్నం చేసేటప్పుడు దానిని భగీరథ ప్రయత్నంతో పోల్చడం మనందరికీ ఆనవాయితీ అని అన్నారు. మానవుడు పట్టుదలతో ప్రయత్నిస్తే సాధించలేనిది ఏమిఉండదని నిరూపించిన మహనీయులు మహర్షి భాగీరథుడని, ఆయన పట్టుదలను త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి నిర్మల జ్యోతి, కాశీ విశ్వేశ్వర స్వామి గుడి ఛైర్మన్ తూము సుబ్బారావు, ఏఎంసీ డైరెక్టర్ పప్పు శ్రీను,తుము రాజేష్,పాలూరి వెంకటేశ్వర రెడ్డి, ప్రకాశం జిల్లా సాగర /ఉప్పర అధ్యక్షులు జూటూరి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి జలశ్రీ మురలీ కృష్ణ, ఒంగోలు నగర అధ్యక్షులు రెడ్డి పరమేశ్వరావు, కార్యదర్శి కర్ణాటి వేణు, పలువురు నాయకులు దండూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత 22 (ఏ) భూములపై ప్రత్యేక దృష్టి పెట్టాం

- జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు







కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 23

రెవెన్యూ సమస్యలు, ముఖ్యంగా నిషేధిత 22 (ఏ) భూములపై ప్రత్యేక దృష్టి పెట్టామని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి సిసిఎల్ఏ జయలక్ష్మి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ప్రకాశం భవనం నుంచి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 22 (ఏ) భూముల సమస్యలపై వారం రోజుల్లో మరింత పురోగతి సాధిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో సంబంధిత పత్రాల ప్రత్యేక పరిశీలన జరుగుతున్నట్లు చెప్పారు. రీసర్వే, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో కూడా పురోగతి ఉండేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. స్వచ్ఛభారత్ మిషన్లో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు నిర్మించేందుకు అవసరమైన స్థలాలను గుర్తిస్తామని చెప్పారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ' జలధార - జల హారతి ' పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఓ బి.చిన ఓబులేసు, డ్వామా పిడి జోసఫ్ కుమార్, ఇరిగేషన్ ఎస్.ఈ. వరలక్ష్మి, సిపిఓ సుధాకర్ రెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నూతన వరుడిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే చంద్రశేఖర్

పెద్ద దోర్నాల పెన్ పవర్ ఏప్రిల్ 23

మండలం చిన్న దోర్నాల గ్రామంలో గుండారెడ్డి చిన్న నాగిరెడ్డి కుమారుడు ఆదినారాయణ రెడ్డి ఏబీఎన్ పాలెంలో యాలకపాటి పెద్ద లక్ష్మయ్య కూమార్తె వివాహ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన యర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గంటా వెంకటరమణారెడ్డి. నియోజవర్గ సి యు టి అధ్యక్షులు షేక్ షేక్షావలి నియోజవర్గ బీసీ సెల్ అధ్యక్షులు ఓ నాగేశ్వరావు మండల వాణిజ్య విభాగం అధ్యక్షులు రావికింది రామారావు. గుండారెడ్డి మల్లికార్జున రెడ్డి. వెన్న ఎల్లారెడ్డి. వెన్న బ్రహ్మారెడ్డి దొండేటి కృష్ణారెడ్డి వైసీపీకి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు అధ్యక్షులు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## ఎమ్మెల్సీ అనంత బాబు బెయిల్ రద్దు చేయాలి

- సాక్షులకు, బాధితులకు రక్షణ కల్పించాలి
- మాదిగ రాజకీయ పోరాట సమితి అధ్యక్షులు ఆకుమర్తి చిన్న మాదిగ ఆధ్వర్యంలో నిరసన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23 :**రాష్ట్రంలో సంచలనం కలిగించిన డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో నిందితుడు ఎమ్మెల్సీ అనంతబాబుకు బెయిల్ రద్దు చేసి అరెస్టు చేయాలని కోరుతూ మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఆకుమర్తి చిన్న మాదిగ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గోకవరం బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్సీ అనంతబాబును" సాక్షులను బెదిరించిన ఘటనలో అరెస్టు చేయాలని కోరుతూ ఆందోళన నిర్వహించారు. వీధి సుబ్రమ ణ్యం హత్య కేసులో కుట్ర దారులను, సాక్ష్యలను బెదిరించిన వ్యక్తులను అరెస్ట్ చేయాలని, బాధితులకు , సాక్షులకు రక్షణ కల్పించాలని కోరుతూ ప్ల కార్డులు పట్టుకొని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఆకుమర్తి చిన్న మాదిగ మాట్లాడుతూ, ఎమ్మెల్సీ అనంతబాబు తన కారు డ్రైవర్ ను కిరాతకంగా హత్య చేసి డోర్ డెలివరీ చేసిన కేసు జరిగి 3 సంవత్సరాల అయినప్పటికీ నిందితుడిని ఇప్పటికీ అరెస్టు చేయలేదని మండి పడ్డారు. కేసు నుంచి తప్పించుకునేందుకు సాక్షులను బెదిరిస్తున్నారన్నారు. నిందితుడి కి కొంతమంది అధికారులు సహకరిస్తున్నారని కేసు నుంచి తప్పించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు . బహిరంగంగా అనంతబాబు అనుచరులు బాధితులను కాకినాడ సమీరా అపార్ట్మెంట్ లో చంపుతామని బెదిరించి, భయభ్రాంతులకు గురిచేసారని అన్నారు. బాధితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. బాధితులను భయభ్రాంతులకు గురి చేస్తున్న ఈ కేసులో ఏ - 1 ముద్దాయి అనంతబాబును, ఏ -2 అనంతబాబు భార్యను, సాక్షులను బెదిరించిన ముద్దాయిలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో సాక్ష్యం చెప్పేందుకు ధైర్యంగా ముందుకు వచ్చిన సాక్షులకు అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో దొండపాటి కృషపర్, రాచర్ల మురళి, వుడమల నాగేశ్వరరావు, బోయినపల్లి సుందరయ్య, కట్టా రాములు, మద్దాల యేసు పాదం, రాచర్ల మురళి, బొడ్డపాటి నాగేశ్వరరావు, తాతపూడి రాజేష్, ఎల్లబెల్లి ఝాన్సీ, మన్యలదుర్గ, పెండ్యాల కుమారి,కొత్తలంక రమణ,మాతా మాలతి తదితరులు పాల్గొన్నారు

## సుంకర భాస్కరరావు మున్సిపల్ హైస్కూల్ లో క్రీడా,సాంస్కృతిక వారోత్సవాలు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఏప్రిల్ 23:**స్థానిక గాంధీ పురం 2 సుంకర భాస్కర రావు నగర పాలక ఉన్నత పాఠశాల లో గురువారం ఆత్మీయ వాతావరణంలో సమగ్ర శిక్ష అభియాన్ సౌజన్యం తో క్రీడా, సాంస్కృతిక వారోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ బహుమతి కార్యక్రమంలో 350 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నగరంలో ఉన్నత విలువలు, ప్రమాణాలతో, పాఠశాల విద్యార్థుల సర్వోతోము ఖాభివృద్ధికి అంకితభావం తో సేవల అందిస్తున్న హెడ్ మాస్టర్ రొబ్బి సన్యాసి రావు, టీచర్ లను పలువురు అభినందనలు తెలియ చేసారు. గత 12 సం. ల పైగా నగరం లోనే అత్యుత్తమ శాస్త్రీయ నృత్య టీం అగ్రగామి ప్రదర్శనల తో పలు జిల్లా కలెక్టర్ లు, మునిసిపల్ కమీషనర్ల, ప్రజా నాయకులు, మన్ననలు పొందుతున్న విద్యార్థి, విద్యార్థినిలను అభినందించారు. అసమాన సేవచేస్తున్న డాన్స్ మాస్టర్ పల్ల దుర్గా ప్రసాద్ ను, హెడ్ మాస్టర్ రొబ్బి సన్యాసి రావు, పాఠశాల పూర్వ విద్యార్థి, అంతర్జాతీయ స్పోర్ట్స్ , కమ్యూనిటీ సైకాలజిస్ట్ సుంకర నాగేంద్ర కిషోర్ లను ప్రశంసలు తెలియ చేశారు. వివిధ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు అల్లరించాయి. డాన్స్ మాస్టర్ పల్ల దుర్గా ప్రసాద్, వ్యాయామ విద్య అసిస్టెంట్ శ్యామల కార్యక్రమాల నివేదిక లు సమర్పించారు.

ఈ కార్యక్రమంలో వర్రే శ్రీనివాస రావు, హెడ్ మాస్టర్ పాఠశాల విద్య కమిటీ ప్రెసిడెంట్ లక్ష్మీ ప్రసన్నంబ, కాలేపు లూకే రాజు లు విజేతలకు బహుమతి ప్రధానోత్సవం ఘనంగా జరిగింది

## మాధవరం రాపాక గోపి అకాల మరణం చాలా బాధాకరం



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. ఏప్రిల్ 23.**తాడేపల్లిగూడెం నియోజకవర్గం రూరల్ మండలం మాధవరం గ్రామానికి చెందిన రాపాక గోపి అకాల మరణం చెందినారు అది తెలుసుకుని మన తాడేపల్లిగూడెం వైస్సార్సీపీ ఇంచార్జ్ వడ్డీ రఘురామ్ నాయుడు వారి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నివేళలా వారి కుటుంబ సభ్యులకి అండగా ఉంటుంది అని తెలిపారు. వారితోపాటు ఈ కార్యక్రమంలో కవులూరి వెంకన్న ఎంపీటీసీ డ్రా నారాయణ గోపిశెట్టి దొరబాబు రాపాక భాను తమ్మిశెట్టి రఘు తమ్మిశెట్టి చుక్కయ్య గారుచుట్టూరి బాపన్న,దారపు రెడ్డి శ్రీనివాస్,మకరాజు సతీష్, రావి వీర రాఘవ, మార్లపూడి సుబ్బారావు కండెల్లి రాజేష్, ద్వారంపూడి కిరణ్ రెడ్డి,కునుకు పుల్లయ్య,ములపర్తి అఖిల్, అడ్డాల గోపి వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ఆదర్శ పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

## జానపద నృత్యాలతో ఆకట్టుకున్న చిన్నారులు

## వేడుకలలో పాల్గొన్న ఎంఈఓ జె ప్రసాదరావు

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 23**

మండల కేంద్రంలోని ఎస్టీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు లక్కీపోగు ఆంటోనీ అధ్యక్షతన పాఠశాల ఉపాధ్యాయులు వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు విద్యార్థుల సంప్రదాయ, ఆధునిక ఆధునిక నృత్యాలతో తమ ప్రతిభను చాటుకున్నారు చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు గేయాలు , దేశభక్తి గీతాలు ప్రేక్షకులను ఆకట్టుకోగా సామాజిక అంశాలపై ప్రదర్శించిన జానపద నృత్యాలు అందరిని మెప్పించాయి ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారి ప్రతిభను మెరుగుపరచడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పలువురు తెలిపారు వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎంఈఓ జె ప్రసాదరావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, యుటిఎఫ్ నాయకులు వెంకటరామయ్య, మండల సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి, బిజెపి మాజీ ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు మాదినేని లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎంఈఓ జె ప్రసాదరావు, షేక్ నాయబ్ రసూల్, యన్ వెంకట్రామయ్య పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమని ఉన్నారు ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాది అని అన్నారు గ్రామీణ ప్రాంతాల్లోనూ నాణ్యమైన విద్య అందుబాటులో ఉందని, తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలపై ఆధారపడకుండా ప్రభుత్వ పాఠశాలలను ఆశ్రయించాలని సూచించారు ప్రతి విద్యార్థి పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభను



వెలికి తీసి మరింత శ్రద్ధ చూపాలని తెలిపారు అడ్మిషన్లు పెంచేందుకు ప్రత్యేక ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించాలని, డ్రాపౌట్స్ విద్యార్థులు తిరిగి చేర్పించే దిశగా కృషి చేయాలని సూచించారు సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందించే సదుపాయాలతో పాటు గ్రామస్తులు సహకారం ఉంటేనే పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని అన్నారు పాఠశాల విద్యాభివృద్ధికి నా వంతు సహాయంగా రూ.10 ,000 /- లు అందజేస్తానని ప్రకటించారు మండలంలో ఆధార్ నమోదు కానీ విద్యార్థులు తమ దృష్టికి తీసుకొని వస్తే ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి సహకారంతో ఆధార్ నమోదు కార్యక్రమానికి సహకరిస్తానని తెలిపారు లక్ష్మణ్ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య




అందిస్తున్నారని విద్యార్థిని తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంటోని మాట్లాడుతూ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన దాతలు మాదినేని లక్ష్మణ్, మన్నేపల్లి పెద్దన్న, తీకెనం బాబురావు, కేసనపల్లి యేసు, ఉపాధ్యాయులను అభినందించారు పాఠశాల అభివృద్ధి కోసం గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ కలిసి విద్యార్థులను పాఠశాలలో చేర్పించి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ భువనేశ్వర్ సాయి లక్ష్మి, తీకెనం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు జె ఎస్ ఆనంద్, షేక్ పాదుషా, జి రామకృష్ణ, అదంషా, వహీదు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కోల్డ్ స్టోరేజ్‌కి భూమిపూజ



**పొన్నలూరు పెన్ పవర్ ,ఏప్రిల్ 23**

మండలంలోని చెన్నుపాడు అడ్డరోడ్డు సమీపంలో 30 కోట్ల రూపాయలతో ముళ్ళమూరి నితీష్ చౌదరి నూతనంగా వారాహి దేవి కోల్డ్ స్టోరేజ్ కి భూమి పూజా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కోల్డ్ స్టోరేజ్ పూర్తయితే చుట్టుపక్కల గ్రామాలలో, మండలాలలో ఉన్న రైతులకు పొగాకుబేళ్లు మిర్చి మినుము శనగ కందులు పెట్టుకునేందుకు అనుకూలంగా ఉంటుందని రైతులు పండించిన పొగాకు బేళ్లు తీసుకొని పక్క మండలాల ఉన్న కోల్డ్ స్టోరేజ్లో నిల్వ ఉంచుతున్నారు. ఈ కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం పూర్తయితే మండలంలోని రైతులకు మేలు జరుగుతుందని చుట్టుపక్కల గ్రామాల్లోని రైతులు అనుకుంటున్నారు.

# అధిక బరువు తగ్గించుకోండి..

## మధుమేహాన్ని నియంత్రించుకోండి




**కల్చరల్ రిపోర్టర్, పెన్ పవర్ ఒంగోలు ఏప్రిల్ 23**

పతంజలి యోగ, భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ మరియు క్రీడాభారతి ప్రకాశం జిల్లా సంయుక్త ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలోని గద్దలగుంటలో గల పింగళి కోదండ రామయ్య సంస్కృతాంధ్ర పాఠశాలలో ఏప్రిల్ 30వ తేదీ నుండి మే 8వ తేదీ వరకు ఉచిత ఇంటిగ్రేటెడ్ యోగ శిక్షణ శిబిరాన్ని, మే 9 నుండి జూన్ 21 వరకు ప్రత్యేక సాధన ప్రారంభిస్తున్నట్లు ప్రకాశం జిల్లా పతంజలి యోగ సమితి కార్యదర్శి సోమ సుబ్బారావు అధ్యక్షులు బోయపాటి రవి, వలివేటి సుధీర్ లు శిక్షణ శిబిరం వేదిక సంస్కృత ఆంధ్ర పాఠశాలలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా సోమ సుబ్బారావు మాట్లాడుతూ శారీరక వ్యాయామంతో పాటు, శరీరం, మనస్సు, ఆత్మలను ఏకం చేసే ఒక సంపూర్ణ యోగా అభ్యాసం అని అన్నారు. ఇది వివిధ సాంప్రదాయ యోగా పద్ధతులను ఒకచోట చేర్చి, ఆధునిక చికిత్సా పద్ధతులతో మిళితం చేసే తరగతి, ఇది ఒత్తిడిని తగ్గించి, మనస్సు ప్రశాంతతను పెంచి, నిత్యజీవితంలో యోగా ఫిలాసఫీని అన్వయించుకోవడంలో సహాయపడుతుందని అన్నారు. కనుక ప్రతి ఒక్కరు ఈ యోగా శిక్షణ శిబిరంలో పాల్గొని యోగ ప్రాణాయామం ధ్యానం నేర్చుకొని ఉన్నటువంటి మధుమేహం రక్తపోటు మానసిక ఒత్తిడి ఆందోళన నిద్రలేమి తదితర పరిస్థితుల నుండి ఆరోగ్య జీవనం వైపు ప్రయాణించాలని సూచించారు. శిక్షణ శిబిరంలో శిక్షణ పొందగోరు వారు 9618701010 రిజిస్ట్రేషన్.. వాట్సప్ ద్వారా పూర్తి వివరాలు పొందగలరని వివరించారు. సమావేశంలో కొల్ల శ్రీనివాసరావు, సోమినేని సురేష్, సాగినేని పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# సింగరాయకొండ అంబేద్కర్ గురుకుల పాఠశాలను సందర్శించిన మంత్రి డా.స్వామి

### - వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులకు పలు సూచనలు చేసిన మంత్రి





**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 23**

సింగరాయకొండలోని డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను గురువారం నాడు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సందర్శించారు. రేపటి నుంచి పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవులు ఇస్తున్న నేపథ్యంలో విద్యార్థులు ఎండలకు బయట తిరగవద్దని, చెరువులు కాలువలలో ఈతలకు వెళ్ళకుండా సురక్షితంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను మంత్రి పరిశీలించారు. పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ జరిగినప్పుడు విద్యార్థుల తల్లిదండ్రులు భోజనం చేయడానికి, మీటింగ్ నిర్వహించేందుకు ఉపయోగించే మీటింగ్ హాల్ కు మళ్లీ పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అయ్యేనాటికి వాటికి మరమ్మత్తులు చేయాలని అధికారులకు మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సూచించారు.

# నూతన ఉపకులపతి ని కలిసిన కదిరి పార్ధసారధి




**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 23**

ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం నూతన ఉపకులపతి గా డాక్టర్.పి.వి. సత్యనారాయణ నియమితులైయ్యారు.ఈ సందర్భంగా బుధవారం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీడ కరెస్పాండంట్ కదిరి పార్ధసారధి గుంటూరు లాం లోని అయన కార్యాలయం లో మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేసారు.

# ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలి

## ఎంపీడీవో వి.ప్రతాపరెడ్డి







**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 23**

ఉపాధి హామీ పనులను వేగవంతం చేసి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీవో వి ప్రతాపరెడ్డి ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు మండలంలోని బోయమడుగుల పంచాయతీ లో కొనసాగుతున్న ఉపాధి హామీపనులను ఎంపీడీవో గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పని ప్రదేశాన్ని సందర్శించి మస్టర్లను పరిశీలించారు. పనుల పురోగతి, హాజరు వివరాలను తనిఖీ చేస్తూ కూలీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఉపాధి కూలీలు ఉదయం వేళ ల్లోనే పని చేయాలని సూచించారు.ఉదయం ఆరు గంటలకే పని ప్రదేశానికి వచ్చి పనులు చేపట్టడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించుకోవచ్చని తెలిపారు.అనంతరం గ్రామంలో ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్స్ వినియోగం, స్వచ్ఛ రథం సేవలు, శానిటేషన్ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ శుభ్రత, పారిశుధ్యం విషయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఏపీవో సుబ్బారావు, డిప్యూటీ ఎంపీడీవో బ్రహ్మానందరెడ్డి, పిడిఓ, టిడిపి అధ్యక్షులు రమణారెడ్డి, ఉపాధి కూలీలు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# దీక్ష పట్టుదలకు మారుపేరు భగీరథ మహర్షి

## జిల్లా కలెక్టర్ విజయ సునీత

**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఏప్రిల్ 23**

మహోన్నత ఆశయం కోసం వేల సంవత్సరాలు తపస్సు చేసి సఫలీకృతుడైన భగీరథ మహర్షి అకుంఠిత దీక్ష పట్టుదలకు మారుపేరుగా నిలిచిపోతారని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత కొనియాడారు. గురువారం పట్టణంలోని విద్యుత్ కార్యాలయం వద్ద భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ఆయన విగ్రహం, చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బ్రహ్మదేవుని ప్రత్యక్షం కోసం ఒంటి కాలుపై తపస్సు చేసి గంగను భూమి పైకి తెప్పించడంలో ఆయన సఫలీకృతులయ్యారని వివరించారు. సంకల్ప బలంతో ఏదైనా సాధించవచ్చునే విషయాన్ని విద్యార్థులు, యువకులు తెలుసుకోవాలని సూచించారు. భావితరాలకు ఈయన చరిత్రను తెలియజేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు పీవీ కృష్ణారావు, ఇతర ఉప్పర, సగర సంఘం నాయకులు పాల్గొన్నారు.



# పశుపోషకులకు రాయితీ పై జొన్నలు పంపిణీ

**వలేటివారిపాలెం, పెన్ పవర్ ఏప్రిల్ 23**

పశుపోషకులకు రాయితీ పై జొన్నలు పంపిణీకి సిద్దంగా ఉన్నట్లు పోకూరు పశువైద్యాధికారి డాక్టర్ సుధాకర్ తెలిపారు. మల్టీకట్ హైబ్రీడ్ జొన్నలను 75 శాతం రాయితీ పై ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం పశుపోషకులకు 7 టన్నులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు . కావాల్సిన పశు పోషకాలు ఆధార్ కార్డు, పొలం పాస్ బుక్ తీసుకుని రైతు సేవా కేంద్రాల్లోని పశువైద్య సహాయకులను సంప్రదించాలన్నారు.



# నిత్యాన్న దాన పథకానికి మాజీ మంత్రి శిద్ధా విరాళం



**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 23**

తిరుమల తిరుపతి కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని శిద్దా రాఘవ రావు కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకొన్న అనంతరం స్వామి వారి తరిగొండ వెంగమాంబ నిత్యాన్న దాన పథకానికి విరాళం అందించారు.ఈ మేరకు శిద్దా రాఘవ రావు దంపతులు,శిద్దా సుధీర్ కుమార్ దంపతులు అన్నదాన విరాళం రూ 41 లక్షలు చెక్కు ను టీటీడీ అధికారులకు అందచేశారు. అనంతరం శిద్దా రాఘవ రావు దంపతులు తరిగొండ వెంగమాంబ అన్నదాన భవన్ లో కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి అన్నప్రసాదాలు స్వీకరించారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com